Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 15.12.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 28 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com




## అమరావతి
# సినిమా కాదు... సీరియల్!

బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడన్న ప్రశ్నకు బాహుబలి-2లో సమాధానం లభించింది. చంద్రబాబు అమరావతి రాజధాని పేరుతో ఏం చేస్తున్నాడన్నదానికి ఈ దశాబ్దంలో సమాధానం లభించేటట్లు లేదు. చైనా-భారత్‌ల మధ్యం డోక్లాం, ఇజ్రాయిల్-పాలస్తీనాల మధ్య జెరూసలేం సమస్యలకు పరిష్కారం లభించినా కూడా అమరావతి అనే జడపదార్థం ప్రజలకు అర్థమయ్యేటట్లు లేదు. అసలు లేని నగరం పేరుతో ఇన్ని డ్రామాలు సృష్టించి, ఇన్ని దేశాలు తిరిగి, ఇన్ని కోట్లు తగలేయడం బహుశా చంద్రబాబుకు ప్రత్యేకంగా తెలిసిన విద్యేననుకోవాలి.

(మిగతా 10వ పేజీలో)

## హాస్యనటుడు విజయ్ ఆత్మహత్య
# ఎవరిదీ పాపం ఎవరికిది శాపం



నవయుగ యాజమాన్యంతో ఈ కుటుంబానికున్నది బంధమా... బంధుత్వమా?

(వివరాలు 10వ పేజీలో)



## ఈ హీరో... త్వరలోనే జీరో!
# పవన్‌కు అంత సీనెందుకు?

రాష్ట్ర రాజకీయాలలో ఇప్పుడు ఎవరికీ అంతుచిక్కని చిక్కుముడి... పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్. సుడిగాలి లాంటోడు. వస్తాడు... క్షణాలలో విధ్వంసం సృష్టిస్తుంటాడు... పోతుంటాడు. గత వారంరోజుల్లో ఇదే జరిగింది. ఎందుకొచ్చాడో, ఎందుకు మాట్లాడాడో, ఎందుకు పోయాడో తెలియనంత వేగంగా రావడం, మాట్లాడడం, పోవడం జరిగాయి.

రాజకీయాల్లోకి వచ్చే వాళ్ళకైనా, రాజకీయ పార్టీలు పెట్టేవాళ్ళకైనా ఒక లక్ష్యం అనేది ఉంటుంది. ఎన్టీఆర్ పార్టీ పెట్టినా, చిరంజీవి పార్టీ పెట్టినా, జయప్రకాశ్ నారాయణ పార్టీ పెట్టినా, జగన్ పార్టీ పెట్టినా అందరి లక్ష్యం అధికారమే! టైంపాస్ కోసమో, జీవనోపాధి కోసమో ఎవరూ పార్టీ పెట్టరు. ప్రతి పార్టీ స్థాపన వెనుక ఒక సిద్ధాంతం, అధికారమనే లక్ష్యం ఉంటాయి.

కాని, రాష్ట్ర రాజకీయాలలో ఒక సిద్ధాంతం, ఒక లక్ష్యం అన్నవి లేకుండా ఏర్పడ్డ పార్టీ జనసేన. మెగాస్టార్ చిరంజీవి

(మిగతా 10వ పేజీలో)



## నెల్లూరులో మరో వస్త్ర ప్రపంచం...

# సౌత్ ఇండియా షాపింగ్ మాల్




రోజురోజుకు కార్పొరేట్ సొగసులద్దుకుంటూ సరికొత్త రూపాన్ని సంతరించుకుంటున్న నెల్లూరు నగరంలో మరో మణిహారం వెలిసింది. ఆధునిక అభిరుచులను ఆస్వాదించే నెల్లూరీయుల ఆలోచనలకు తగినట్లుగా నగరంలోని మద్రాసుబస్టాండ్ వద్ద సౌత్ ఇండియా షాపింగ్ మాల్ రూపుదిద్దుకుంది. సరికొత్త అందాలతో, లక్షలాది వెరైటీలతో, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ధరలతో ముస్తాబైన ఈ షాపింగ్ మాల్‌ను ఈనెల 15వతేదీన సినీ హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్ ప్రారంభించనున్నారు. పెద్దపెద్ద నగరాలలో మాత్రమే వున్న సౌత్‌ఇండియా షాపింగ్ మాల్ ఇప్పుడు నెల్లూరులోను అడుగుపెట్టింది. వస్త్రాభిమానులకు సంక్రాంతి పండుగను నెలముందే తెచ్చింది.

### కోట శివరామయ్య స్మారక

## బ్యాడ్మింటన్ పోటీలు

ఈ నెల 24వ తేదీన నెల్లూరులోని ఏ.సి స్టేడియంలో కోట శివరామయ్య స్మారక బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు కోట రమేష్‌బాబు తెలిపారు. ఆరోజు ఉదయం 8గంటల నుండి పోటీలు ప్రారంభమవుతాయి. నెల్లూరు, ప్రకాశం, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన ఆర్యవైశ్య షటిల్ క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనవచ్చు. ఉదయం 8గంటల నుండే పోటీలు మొదలవుతాయి. అన్ని జిల్లాల నుండి దాదాపు 200 జట్లు పోటీలలో పాల్గొననున్నాయి. నగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, సింహపురి పెయింట్స్ అధినేత కోట సూర్యనారాయణలు పోటీలను పర్యవేక్షిస్తారు. ప్రథమ బహుమతిగా 20వేల నగదు, ద్వితీయ బహుమతిగా 10వేలు, తృతీయ బహుమతిగా 7వేలు, నాల్గవ బహుమతిగా 5వేల నగదు అందజేయనున్నట్లు కోట రమేష్‌బాబు తెలిపారు.

## ఇస్కపల్లి మెరైన్ సిఐగా రామకృష్ణారెడ్డి

నెల్లూరుజిల్లా ఇస్కపల్లి మెరైన్ సిఐగా కె.రామకృష్ణారెడ్డిని నియమిస్తూ ఈ నెల 10న గుంటూరు రేంజ్ డిఐజి కె.వి.వి.గోపాలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో జిల్లాలో అనేక చోట్ల ఎస్సైగా, సిఐడి సిఐగా, నెల్లూరు రెండవనగర ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. నెల్లూరులో చోటు చేసుకున్న క్రికెట్ బెట్టింగ్ కేసుల మూలంగా సుమారు 3నెలల క్రితం రామకృష్ణారెడ్డిని రేంజ్ విఆర్‌కు బదిలీ చేశారు. తాజాగా ఆయన్ను ఇస్కపల్లి మెరైన్ సిఐగా నియమించారు.

# మెట్టలో గట్టెక్కని కష్టాలు

**దేశమంతా వర్షాలు బాగా కురిసినా ఆ ప్రాంతంలో కనీస వర్షాలు కురవవు. దేశంలో డ్యాంలు, చెరువులన్నీ నిండినా ఆ ప్రాంతంలో చెరువులు, బావులు నిండవు. తీవ్ర వర్షాభావంతో మెట్టప్రాంతానికి నిలువెత్తు చిరునామాగా నిలిచే ఆ కరువు సీమే ఉదయగిరి ప్రాంతం.**



రావణాసురుడు తన చెల్లెలు శూర్పనఖకు పసుపు కుంకుమ క్రింద ఈ గడ్డను రాసిచ్చాడని, అందుకే ఈ ప్రాంతంలో సరిగా వర్షాలు పడవని, పంటలు పండవని చెప్పుకుంటుంటారు. ఇది పుక్కిటి పురాణమే అయినా కొన్నిసార్లు ఇక్కడ నెలకొంటున్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను చూస్తుంటే వీటిని నమ్మాల్సిన పరిస్థితి వస్తుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో వర్షాలు ఓ మోస్తరుగానే పడ్డాయి. మరీ వరదలు వచ్చి చెరువులు తెగిపోయేంత వానలు లేకున్నా తాగునీటికి, ఒక కారు సాగు నీటికి ఇబ్బంది లేనంతగా కురిసాయి. సోమశిలకు 50 టీఎంసీలకు పైగానే నీళ్ళు రాబట్టి మొదటి పంటకు నీళ్లిస్తున్నారు. అయితే జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలలో మిగతా 9 నియోజకవర్గాలు ఒకెత్తయితే ఉదయగిరి ఒక్కటే ఒకెత్తు. వరుసగా మూడో ఏడాది కూడా ఈ ప్రాంతంలో సరిగా వానలు పడలేదు. నెల్లూరు చుట్టుపక్కల గత నెలలో భారీ వర్షాలు కురిసిన రోజుల్లో కూడా ఉదయగిరి, సీతారామపురం, వింజమూరు, దుత్తలూరు, వారికుంటపాడు, కొండాపురం మండలాలలో ఎండలు సుర్రుమనిపించాయి. అడపాదడపా సన్నటి జల్లులు పడడం తప్ప చెరువుల్లోకి, బావుల్లోకి నీళ్లొచ్చే స్థాయిలో వానలు పడలేదు. జిల్లాలోని మిగిలిన 9 నియోజకవర్గాలకు సోమశిల నీళ్ళు పారుతుంటాయి. సోమశిలకు 250 కిలోమీటర్ల దూరంలో వున్న చెన్నైకు, 200 కిలోమీటర్ల దూరంలో వున్న తిరుపతికి కూడా పెన్న నీళ్ళు పోతుంటాయి. పెన్నకు గట్టిగా పాతిక కిలోమీటర్ల దూరం లేని ఉదయగిరి మెట్టప్రాంతానికి మాత్రం సోమశిల నీళ్ళుండవు. అది ఈ మెట్టప్రాంత ప్రజల దరిద్రం.

ఉదయగిరి ప్రాంతవాసులకు సోమశిల నుండి నీళ్ళు అందించాలన్న లక్ష్యంతో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా వున్న ఆనం రామనారాయణరెడ్డి దాదాపు 400కోట్ల అంచనాలతో సోమశిల హైలెవల్ కెనాల్‌ను మంజూరు చేయించారు. అయితే ఈ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ కెనాల్ పూర్తయితేనే ఉదయగిరి ప్రాంతానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈలోపు మెట్టకు కష్టాలు గట్టెక్కేటట్లు లేవు. ఈ ఏడాది కూడా వర్షాలు లేక రైతులు పొలాలను బీళ్ళుగా పెట్టుకుంటున్నారు. కొద్దిపాటి వర్షాలు కురిసున్నా వేలాది ఎకరాలలో మినుము, పొగాకు సాగుచేసేవాళ్ళు. ఈ సంవత్సరం నీళ్ళు లేక పెద్దగా ఆ పైర్లు కూడా వేయలేదు.

సాగునీరు సంగతి అటుంచితే ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలకల్లా ఈ మండలాలలో తాగునీటి సమస్య కూడా తీవ్రమయ్యే ప్రమాదముంది.

సింహపురి సమాచారం

## కవి బొగ్గరపుకు సన్మానం



హైదరాబాదు కేంద్రంగా పనిచేస్తున్న 'జమా అతె ఇస్లామీ హింద్' అనే సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న రవీంద్రభారతి ఆడిటోరియంలో అందరి ప్రవక్త మహమ్మద్ ఉద్యమం సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా గీటురాయి వారపత్రిక ప్రధాన సంపాదకులు ఓనాబ్ ఎస్.ఎమ్.మాలిక్ వ్యవహరించగా ప్రముఖ రచయిత సాహిత్య ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా "విశ్వప్రభువు దృష్టిలో" శీర్షికతో బొగ్గరపు కవిత వినిపించి సభికుల హర్షధ్వానాలు అందుకున్నారు. అనంతరం సంస్థ కన్వీనర్ అబ్దుల్ రషీద్, ప్రముఖకవి, కాలమిస్ట్ యం.డి ఉస్మాన్‌ఖాన్, సాహిత్య ప్రకాష్ తదితరులు బొగ్గరపు రాధాకృష్ణ మూర్తిని శాలువ, మెమెంటో, దివ్యఖురాన్ గ్రంథంతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి వచ్చిన కవులతో జరిగిన ఈ ప్రత్యేక కవిసమ్మేళనంలో పాల్గొన్న బొగ్గరపుకు పలువురు సాహితీవేత్తలు, కవులు అభినందనలు తెలిపారు.



# పార్కు స్థలాల్లో... సబ్‌స్టేషన్‌లా?

- ఎమ్మెల్యే అనిల్



సమస్యలపై ఫోన్ ద్వారా అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరులోని 16వ డివిజన్‌లో ఉన్న జగదీష్‌నగర్ పార్కు స్థలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేయవద్దని నెల్లూరు నగర ఎమ్మెల్యే డా. పి.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఇక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తుండడంపై స్థానికులు చేస్తున్న ఆందోళనకు ఆయన మద్దతు పలికారు. ఈ నెల 13న ఎమ్మెల్యే జగదీష్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ఇప్పటికే ఇక్కడి కొంతస్థలం వాటర్‌ట్యాంక్‌కు ఇవ్వడం జరిగిందని, మిగిలిన స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మిస్తే పార్కుకు స్థలం అనేది లేకుండాపోతుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారన్నారు. పెద్దలు వాకింగ్ చేసేందుకు, చిన్నారులు అడుకునేందుకు వీలుగా ఉన్న పార్కులో సబ్‌స్టేషన్ నిర్మించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు బాధపడుతున్నారని, అందువల్ల వేరొక ప్రాంతంలో సబ్‌స్టేషన్ నిర్మించుకోవాలని తాను అధికారులకు తెలిపానని ఎమ్మెల్యే అన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం మునిసిపల్ పార్కు స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, ఒకవేళ ఏదైనా నిర్మాణం చేయదలుచుకుంటే అందుకు అక్కడి స్థానికుల సమ్మతి ఉండాలని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలోనే రోడ్డు చివరన 700 అంకణాల స్థలం ఉందని, అందులో సబ్‌స్టేషన్ నిర్మించుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన సూచించారు. అందుకు కమిషనర్ కూడా సానుకూలంగా స్పందించారన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఊటుకూరు మాధవయ్య, నాయకులు వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, గూడూరు సురేంద్రరెడ్డి, సగిలి జయరామిరెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, ముదిరెడ్డి లక్ష్మీరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతిని కలిసిన...

# నెల్లూరు బీజేపీ నేతలు



వెంకయ్యనాయుడుతో దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, కళ్యాణ్



వెంకయ్యనాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న పి.సురేంద్రరెడ్డి

బీజేపీ సీనియర్ నాయకులు, ఎఫ్‌సిఐ మాజీ డైరెక్టర్ దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, తన సోదరుడి కుమారుడు యువనేత దువ్వూరు కళ్యాణ్‌రెడ్డితో కలిసి 13వతేదీ ఢిల్లీలోని ఉప రాష్ట్రపతి భవన్‌లో ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడిని కలిసారు. జిల్లాలోని రాజకీయ పరిస్థితులు, ఆక్వా రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి కూడా విడిగా ఉపరాష్ట్రపతిని కలిసి దరఖాస్తు చేసుకున్న పేదలందరికీ ఇళ్ళు మంజూరు చేయాలని, దూరదర్శన్, ఎఫ్ఎం రేడియో స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని, నెల్లూరులో వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని నెలకొల్పాలని కోరుతూ వినతిపత్రం అందించారు.


## మహిళా పోలీస్‌స్టేషన్

# డిఎస్పీగా శ్రీధర్

నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్ డిఎస్పీగా చిత్తూరు జిల్లా చంద్రగిరికి చెందిన పి.శ్రీధర్ నియమితులయ్యారు. ఒంగోలు ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీగా పని చేస్తున్న ఆయనను సాధారణ బదిలీల్లో భాగంగా నెల్లూరుకు మార్చారు. ఇప్పటి వరకు మహిళా పోలీస్‌స్టేషన్ డిఎస్పీగా పనిచేస్తున్న కె.శ్రీనివాసాచారిని విఆర్‌కు బదిలీ చేస్తూ డిజిపి సాంబశివరావు ఈనెల 11న ఉత్తర్వులు జారీ చేశారు.




# ఉత్తరక్రియలు



జై ఆంధ్ర ఉద్యమ సారధి... మెట్టప్రాంత ప్రగతి వారధి
పేద, బడుగు వర్గాల పెన్నిధి... మానవత్వానికి ప్రతినిధి
ఉదయగిరి ప్రాంతంలో ఉదయించిన అభివృద్ధి సూరీడు
పేదల గుండెల్లో కొలువైన మహా నాయకుడు
ప్రజల ఆశాదీపం... మా ఇంటి దైవం

## కీ॥శే॥ శ్రీ మాదాల జానకిరాం గారు

తేది 6-12-2017 బుధవారం నాడు స్వర్గస్తులైనారు.
వారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని
భగవంతుని ప్రార్థిస్తున్నాము.

భార్య:
మాదాల సూర్యవతి
కుమార్తెలు:
మాదాల అర్చన, మాదాల చందన, మాదాల రమ
మరియు
కుటుంబసభ్యులు

కీ॥శే॥ శ్రీ మాదాల జానకిరాం గారు
మాజీ మంత్రివర్యులు
జననం: 13-03-1946 | మరణం: 06-12-2017

**పెద్దకర్మ : తేది 20-12-2017 బుధవారం**
నెల్లూరుజిల్లా, దుత్తలూరు మండలం, నర్రవాడ గ్రామంలోని
మా స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

**సంతాప సభ : తేది 20-12-2017 ఉ. 9 గంటలకు**
నర్రవాడ గ్రామంలో మాదాల అభిమానులు,
ఆత్మీయుల మధ్య నిర్వహించబడును.

## 'ప్రభా'తం

# అనారోగ్య భారతం

దేశంలో ప్రజారోగ్యం పడకేసింది. ముఖ్యంగా, మాతా శిశువుల స్థితి మరింత దయనీయంగా తయారవుతోంది. తల్లిని, తల్లి గర్భంలో ఉన్న శిశువులను పరిరక్షించుకునేందుకు ప్రభుత్వాలు తీసుకోవాల్సినంత శ్రద్ధ, చొరవ తీసుకోవడం లేదు. ఫలితంగా మాతా శిశు మరణాలు నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. ఈ దుస్థితి నుంచి ప్రజలను కాపాడుకోవాలి. ప్రజారోగ్యాన్ని పరిరక్షించుకోవాలి. అందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చిత్త శుద్ధితో ముందుకు వచ్చి 'ఆరోగ్యభారత్' కలను సాకారం చేయాలి.

మన దేశంలో ప్రజారోగ్యం పడకేసింది. అనారోగ్యం మాత్రం అంతటా విస్తరిస్తోంది. ఏ చేయూతా లేక అసహాయస్థితిలో ఉన్న పేదలను ఆదుకునేందుకు ఉన్న అనేకానేక పథకాలు ఆచరణలో చట్టుబండలవుతుండడంతో రకరకాల వ్యాధుల బాధలతో, అనారోగ్యాలతో ప్రజలు నిత్యం వేదన పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా, పేదరికం కారణంగా గర్భిణులు సరైన పౌష్టికాహారం లేకపోవడం వల్ల..వారితో పాటు, శిశువుల ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే ఉంటోంది. రానురాను మన సమాజంలో మాతా శిశువుల స్థితి మరింత దయనీయంగా తయారవుతోంది. తల్లిని, తల్లి గర్భంలో ఉన్న శిశువులను పరిరక్షించుకునేందుకు ప్రభుత్వాలు తీసుకోవాల్సినంత శ్రద్ధ, చొరవ తీసుకోవడం లేదు. ఫలితంగా మాతా శిశు మరణాలు నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. గర్భిణులకు ఎన్నో పథకాలను ప్రభుత్వాలు ప్రవేశపెట్టినా అవి ఆచరణలో నామమాత్రంగానే ఉంటుండడంతో గర్భిణులకు సరైన పోషకాహారం అందక వారు నానా యాతనలు పడుతూనే ఉన్నారు. మరీ మనదేశంలో పౌష్టికాహారం లభించక, ఎంతోమంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారని, దేశవ్యాప్తంగా ఉన్న గర్భిణుల్లో సగానికి పైగానే ఈ దురవస్థకు గురవుతున్నారని ఇటీవల వెలుగులోకి వచ్చిన అంతర్జాతీయ పోషకాహార నివేదిక స్పష్టం చేస్తోంది కూడా. అదేవిధంగా దేశవ్యాప్తంగా మరో 38 శాతానికి పైగానే పిల్లలు అటు మానసికంగాను, ఇటు శారీరకంగానూ సరైన ఎదుగుదల లేక బక్కచిక్కిపోతున్నారని, జీవితకాలంలో వారు పడుతున్న బాధలు వర్ణనాతీతమని గణాంకాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో పౌష్టికాహార మిషన్‌ను ఏర్పాటు చేసి, పోషకాహారం లభించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రధాని మోడీ ఆధ్వర్యంలోని కేంద్రప్రభుత్వం తాజాగా సన్నాహాలు చేస్తుండడం ఎంతో అభినందనీయమే అయినప్పటికీ, ఇప్పటికే దేశంలో అనేకమంది గర్భిణులు, శిశువులు పేదరికంతో, పౌష్టికాహార లోపంతో అనేకవిధాలుగా కష్టాలు పడుతూనే ఉన్నారు. ఆ ప్రయత్నమేదో ఇప్పటి ప్రభుత్వం మరింత వేగవంతంగా చేయాలి. ఎందుకంటే, దాదాపు పాతికేళ్ళ దీర్ఘకాలంలో దేశంలో మున్నెన్నడూ లేనంతగా సరైన పౌష్టికాహారం లభించక తల్లులు, పిల్లలు పడిన బాధలు అన్నిన్ని కావు. ఈ పరిస్థితిని ఎప్పటికప్పుడు గతంలో నిపుణులు హెచ్చరించినా గత ప్రభుత్వాలు ప్రజారోగ్యం పట్ల ఆశించిన శ్రద్ధ తీసుకోకపోవడమే బాధాకరం. మనదేశంలో అన్ని పథకాలు కాగితాల మీద అద్భుతంగా ఉంటాయి కానీ, ఆచరణలోకి మాత్రం రావడం లేదు. ఒకవేళ వచ్చినా అవి అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఒక్కోచోట, ఆసుపత్రులకు వెళ్ళే గర్భిణులను సరిగ్గా పలకరించే దిక్కు కూడా ఉండదు. ఆసుపత్రులకు కోట్లల్లో నిధులు వస్తున్నా, వైద్యులు సిబ్బంది తదితర యంత్రాంగమంతా భారీగానే ఉంటున్నా విధి నిర్వహణలో అనేకమంది చూపుతున్న అలసత్వం తల్లుల పాలిట వేదనగా..నరకయాతనగా మారుతోంది. ఆసుపత్రుల్లో సరైన వసతులు లేక, దోమలు, ఈగలు, దుర్వాసన చుట్టుముడుతున్నా, పడకలు సరిగా లేక గబ్బుకొట్టిపోతున్నా పట్టించుకునే నాధులు ఉండరు. ఒక్కోసారి సరైన సమయంలో తగు చికిత్సలు చేసేవారు ఉండరు. ఉన్నా వారి నిర్లక్ష్యధోరణి చూస్తే మన బాధ ఇంకెవరికి చెప్పుకోవాలో తెలియదు. ఆసుపత్రుల్లో మందుల కొరత లేకున్నా, రోగులకు అవసరమైన మందులు మాత్రం ఉండవు. స్కానింగ్‌లు, స్క్రీనింగ్‌లు, రకరకాల వైద్యపరీక్షలు ఇక్కడ అందుబాటులో లేవని, అవన్నీ బయట చేయించుకురావాలని నిక్కచ్చిగా చెప్పే ఆసుపత్రులకు మనదేశంలో కొదవే లేదు. అయితే, బయటకు వెళ్ళి అన్ని రకాల మందులు తెచ్చుకోవాలంటే, వైద్యపరీక్షలకు వేలకు వేలు ఖర్చుపెట్టుకోవాలంటే పేదలకు అంత డబ్బు అందుబాటులో ఉండదు. ప్రభుత్వాసుపత్రుల్లో అన్నీ ఉచితమనే చెప్తున్నా దేశంలోని అనేకప్రాంతాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో ఇలాంటి కొరతలెన్నో ఉన్నాయి. గ్రామీణప్రాంతాల్లోనైతే ఈ బాధలు బోలెడు. నిత్యం పేదప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలే ఇవి. గర్భిణులకు బాలింతలకు ఒక పూట పెట్టే భోజనం కూడా నాసిరకంగానే ఉంటుండడం, మాతా శిశువుల కోసం ప్రభుత్వాలు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు, బియ్యం, పౌష్టికాహారం వంటివి సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పక్కదారులు పడుతుండడం అనేకచోట్ల మనం చూస్తూనే ఉన్నాం. పేదరికంలో పుట్టిన ఒక తల్లి, తన బిడ్డకు జన్మనిచ్చే దాకా భయంభయంగానే ఆసుపత్రుల్లో కాలం వెళ్ళదీస్తున్న దృశ్యాలు మన ప్రభుత్వాసుపత్రుల్లో కొల్లలుగా చూడవచ్చు. అయినా, ఎవరికీ కనికరం ఉండదు. అంతా నిర్లిప్తతే. కనీసం మానవతా దృక్పథంతోనైనా రోగుల పట్ల కరుణతో వ్యవహరించాలన్న స్పృహ ఆసుపత్రుల్లో చాలా మందికి ఉండడం లేదన్నదే రోగుల వేదన. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు మాతాశిశువుల బాధలను గుర్తించి వారి సమస్యలు తీర్చేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఆరోగ్యకేంద్రాలు, ఆసుపత్రుల్లో మాతాశిశువులకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి, వారికి సరైన పౌష్టికాహారం సమకూర్చి, ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిచ్చేవిధంగా, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని తీర్చిదిద్దుకునేవిధంగా అటు పాలకులు, ఇటు అధికారయంత్రాంగం వెంటనే సమాయత్తం కావాలి. సరైన ఆరోగ్యం లేక అలమటిస్తున్నవారిని కబళించేందుకు అకాల మరణాలు పొంచి ఉంటాయి. ఈ దుస్థితి పోవాలి. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాల పట్ల మరింత పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలి. పథకాలను లోపభూయిష్టంగా అమలుచేస్తున్నవారిని దండించాలి. అందరికీ ఆరోగ్యం అందుబాటులోకి రావాలంటే చిన్నవిషయం కాదు. అందుకు ఎంతో కట్టుదిట్టమైన ప్రణాళికలు అవసరం. చెప్పే మాటలకు చేసే చేతలు తోడు కాకుంటే ఈ పరిస్థితిలో మార్పు ఎంతమాత్రమూ ఉండదు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వాలు తక్షణం సమాయత్తం కావాలి. ముఖ్యంగా మాతాశిశువుల ఆరోగ్య పరిరక్షణకు పటిష్టమైన యంత్రాంగాన్ని రూపొందించాలి. ప్రజారోగ్యం కోసం అటు పాలకులు, ఇటు ప్రభుత్వాలు..అధికారులు అందరూ కలిసి చిత్తశుద్ధితో కృషి చేసినప్పుడే 'ఆరోగ్య భారత్' సాకారమవుతుంది.

## జాతీయ లోక్‌అదాలత్‌కు విశేష స్పందన




లబ్దిదారులకు పరిహారం అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్

నెల్లూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి న్యాయసేవాధికార సంస్థ ఛైర్మెన్ జునైద్ అహ్మద్ మౌలానా పేర్కొన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడుతూ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడంలో కాలంతో పాటు ఖర్చు లేకుండా త్వరితగతిన పరిష్కారం అవుతుందన్నారు. జాతీయ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. లోక్‌అదాలత్‌లో మొత్తం 1152 కేసులు పరిష్కారం కాగా రూ. 8,49,64,897 పరిహారాన్ని లబ్ధిదారులకు చెల్లించారు. నెల్లూరు నగరంలో ఆరు బెంచీలను ఏర్పాటు చేసి న్యాయమూర్తులు బి. శ్రీనివాసరావు, పిజె సుధ, పివి సుబ్బారావు, అతిక్ అహ్మద్, అరుణశ్రీ, టి.వాసు దేవన్ ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించి 351 కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు శ్యామలా దేవి, మహ్మద్ అబ్దుల్ రఫీ, శ్రీదేవి, పలు కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం


సభలో మాట్లాడుతున్న ఆచార్యఆదిత్య

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఈ నెల 10వ తేదీన నెల్లూరులోని ఆదిత్య కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అగ్రికల్చర్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య ఆదిత్య మాట్లాడుతూ భారత రాజ్యాంగమే మానవ హక్కుల దినోత్సవం అని అన్నారు. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలను వివరించారు. ప్రతిఒక్కరు మానవ హక్కులను వారి బాధ్యతగా నిర్వర్తించినప్పుడే భారతదేశం ప్రపంచ దేశాలలో ప్రథమస్థానంలో ఉంటుందన్నారు. సోంపల్లి ఆనందరావు, గోవిందు, రవీంద్ర, శ్రీనివాసన్, జయరామయ్య, మహిధర్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.




## చంద్రబాబు ఏజెంట్ పవన్

నెల్లూరు నగర ఎమ్మెల్యే పి. అనిల్‌కుమార్‌యాదవ్ చెప్పినట్లు పవన్ కళ్యాణ్ పెద్ద చవట. చంద్రబాబు ఇంట్లో పెంపుడు జంతువులాంటోడు. అతనికి కావాల్సింది ప్యాకేజీనే! రాజకీయాలలో ఎవరన్నా ప్రభుత్వంతో పోరాడుతారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తారు. ఈ ప్యాకేజీల పవన్ మాత్రం ప్రతిపక్షంపై విమర్శలు చేస్తాడు. చంద్రబాబు అవినీతి ప్రభుత్వానికి కొమ్ము కాస్తాడు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఏ ఒక్క అవినీతి కార్యక్రమాన్నయినా, ఒక్క దుర్మార్గాన్నైనా ఈ పవన్ కళ్యాణ్ ప్రశ్నించాడా? అసలు ఇతను పార్టీ ఎందుకు పెట్టినట్లు? రాజకీయాల్లోకి ఎందుకొచ్చినట్లు? సినిమాలలో నటిస్తే వచ్చేదాని కంటే చంద్రబాబు ప్యాకేజీల రూపంలో ఎక్కువ ముడుతున్నట్లుంది. ఇదే బాగుందనుకుని అప్పుడప్పుడు చంద్రబాబు ఏర్పాటు చేయించే స్టేజీషోలలో పాల్గొంటున్నాడు. దీనికంటే ఏడాదికో సినిమా తీసుకున్నా పవన్ గౌరవంగా వుంటాడు.

**ఎస్.డి. జకీర్, నెల్లూరు.**

## పక్షులను చెదరగొట్టే పండుగ

పక్షుల పండుగ పేరుతో ప్రతి ఏటా విదేశీ పక్షులను చెదరగొట్టే పండుగ చేస్తున్నారు. జనవరి 7, 8, 9తేదీలలో కూడా సూళ్ళూరుపేటలో పక్షుల పండక్కి 3కోట్లు మంజూరు చేశారు. స్వేచ్ఛాజీవులైన పక్షులు సైబీరియా, బర్మా, బంగ్లాదేశ్ నుండి తమ మనోనేత్రాలనే దిక్సూచిగా చేసుకుని సంతానోత్పత్తికి మన పులికాట్ ప్రాంతానికి వస్తాయి. పక్షుల పండుగ పేరుతో వాటి స్వేచ్ఛను హరిస్తున్నారు. పండుగ పేరుతో చేసే రణగొణధ్వనులు పక్షులను బెదిరేలా చేస్తున్నాయి. అసలు ఈ పండుగ అవసరమా? దయచేసి ఆలోచించండి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## లోకేష్ కామెడీ షో

ప్రతి సంవత్సరం ఆస్తుల ప్రకటన ద్వారా ఐ.టి మంత్రి నారా లోకేష్ భలే కామెడీ చేస్తున్నాడు. ఆయన కామెడీ షో జబర్దస్త్‌లో పంచ్‌ల ఆది స్కిట్‌ను మించిపోయేలా ఉంది. ఆయన ఆస్తుల విలువలు అప్ అండ్ డౌన్‌లు ఒక రేంజ్‌లో లేవు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌లోనేమో 300 కోట్ల ఆస్తులు చూపిస్తారు, ప్రజల ముందు బిల్డప్ కోసమేమో 15కోట్లు అంటాడు. ఈ దొంగ లెక్కలు చెప్పేదానికి ఆయన టెన్షన్ పడ్డం దేనికి? అసలు ఆయనను ఆస్తులు ప్రకటించమని ఎవరు అడిగారు.

**కె.టి. నీరజ, కలశపాడు.**

## సిమెంట్ రోడ్డు దండగ

నెల్లూరు నుండి ఆత్మకూరు సమీపాన నెల్లూరుపాలెం వరకు సిమెంట్ రోడ్డు వేసారు. సిమెంట్ ఫ్యాక్టరీలకు డబ్బులివ్వడానికే ఈ రోడ్డు వేసినట్లుగా వుంది. ఇన్ని వందల కోట్లు ఖర్చుపెట్టి వేసినా ఇది డబుల్ రోడ్డే! దీనికి పెట్టిన ఖర్చుతో తారురోడ్డు అయితే నాలుగులైన్లు అయ్యుండేది. ఈ డబ్బుల్లోనే భూసేకరణ కూడా జరిగుండేది. భవిష్యత్‌లో ఇది ట్రాఫిక్ బాగా పెరిగే రోడ్డు. దీనిని నాలుగు లైన్ల సిమెంట్‌రోడ్డుగా మార్చాలంటే భవిష్యత్‌లో చాలా కష్టం.

**చిరమన పెంచలరెడ్డి, బుచ్చి.**



# ఈ మలుపులు... ప్రమాదాలకు పిలుపులు

కోవూరు నుండి విజయవాడ దాకా జాతీయ రహదారిని ఆరులైన్లుగా మార్చారు. ప్రతి క్రాసింగ్ వద్ద అండర్‌పాస్ ఏర్పాటు చేసారు. చిన్న పల్లెటూరుకు కూడా ఇవి ఏర్పడడంతో హైవేను దాటి పోవడం అన్న ప్రశ్నేలేదు. కాబట్టి ప్రమాదాలను చాలావరకు తగ్గించవచ్చు. దరిద్రం ఏంటంటే కోవూరు నుండి తడ దాకా ఆరులైన్లు విస్తరణ పెండింగ్‌లో వుంది. హైవే మీద ట్రాఫిక్ పెరిగింది. చాలా గ్రామాలకు హైవే మీదనే క్రాస్ చేయాల్సి వస్తోంది. నెల్లూరు పరిధిలో చూస్తే ఇనమడుగురోడ్డు, మైపాడురోడ్డు, ముత్తుకూరురోడ్డుల వద్ద మాత్రమే జాతీయ రహదారి విస్తరణ సమయంలో అండర్‌పాస్‌లు ఏర్పాటు చేసారు. ఇప్పుడు చూస్తే నగరం విస్తరించింది. హైవేపైన సిటీ ట్రాఫిక్ కూడా పెరిగిపోయింది. అటు వెంకటేశ్వరపురం నుండి ఆదిత్యనగర్ దాకా, నగరం హైవేదాకా విస్తరించింది. ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో హైవేకి ఆనుకునే అటు ఇటు జనావాసాలు, వ్యాపార కేంద్రాలు వెలిసాయి. పద్మావతినగర్, చిల్డ్రన్స్‌పార్కు రోడ్డు, సుందరయ్య కాలనీల వద్ద కూడా ఇదే పరిస్థితి. ఈ ప్రాంతాలలో సైకిళ్ళు, బైక్‌లు కూడా హైవేపై తిప్పుతున్నారు. గంటకు వంద నుండి 150కిలోమీటర్ల వేగంతో వాహనాలు వెళ్ళే రహదారిపై ద్విచక్రవాహనాలలో ప్రయాణం ఎలా ప్రమాదమో ప్రత్యేక చెప్పబల్లేదు.

చింతారెడ్డిపాళెం, కనుపర్తిపాడు క్రాస్‌లు కూడా ప్రమాదకరంగా మారాయి. ఇతర ప్రాంతాల నుండి నెల్లూరు నగరంలోకి ప్రవేశించే వాహనాలు ఎక్కువుగా చింతారెడ్డిపాలెం క్రాస్ వద్దే మలుపు తిరుగుతున్నాయి. సమీపంలో సింహపురి ఆసుపత్రి వుంది. ట్రాఫిక్ రద్దీ పెరిగింది. హైవే మీద వాహనాలు వేగంగా వస్తుండడం, హైవేలో నుండి సిటీ లోకి, సిటీలో నుండి హైవే మీదకు వెళ్ళే వాహనాలు ఇక్కడే మలుపు తిరుగుతుండడం... వాహనాలు నడిపేవాళ్ళు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏమరుపాటుగా వుంటే ఇక్కడ ప్రమాదమే! కనుపర్తిపాడు జంక్షన్ వద్ద కూడా ఇదే పరిస్థితి. అయ్యప్పగుడి సెంటర్ వద్ద కూడా అండర్‌పాస్ లేక ట్రాఫిక్ కన్‌ఫ్యూజన్... కాకుటూరు వద్ద గొలగమూడికి వెళ్ళే రోడ్డు, వెంకటాచలం వద్ద సర్వేపల్లి రోడ్డు జంక్షన్‌లు కూడా ప్రమాదకరంగా వున్నాయి. ఈ జంక్షన్‌ల వద్ద గతంలో ఎన్నో ప్రమాదాలు జరగడం చూసాం. ఆరులైన్ల సంగతి దేవుడెరుగు... ముందు జంక్షన్‌ల వద్ద హైవేపై అండర్ బ్రిడ్జిలనన్నా పూర్తి చేస్తే ప్రమాదాలు జరక్కుండా ఎందరి ప్రాణాలనో కాపాడినవాళ్లవుతారు.

# ప్రజలకు సేవచేయడం నా అదృష్టం

## ప్రజల దాహార్తిని తీరుస్తున్న... విపిఆర్ అమృతధార

**- ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి**



జిల్లా ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని విపిఆర్ ఫౌండేషన్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. ప్రజల దాహార్తిని తీరుస్తూ విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'విపిఆర్ అమృత ధార'.. ఆర్ఓఆర్ మినరల్ వాటర్ ప్లాంట్స్ నెలకొల్పడంలో భాగంగా 8వ విడత ప్రారంభోత్సవం కార్యక్రమం ఇటీవల పలు గ్రామాల్లో జరిగింది. వెంకటగిరి, సూళ్ళూరుపేట, గూడూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లోని రాపూరు మండలం సైదాదుపల్లి గ్రామంలోను, బాలాయపల్లి మండలంలోని కోటంబేడు గ్రామంలోను, పెళ్ళకూరు మండలంలోని సిరసనంబేడు, సూళ్ళూరుపేట మండలం కోటపోలూరు, కోట మండలం ఊనుగుంటపాళెం, వెంకటాచలం మండలం శ్రీరామాపురం గ్రామాల్లో 8వ విడత 'విపిఆర్ అమృత ధార' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, ప్రముఖులు పాల్గొనగా, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సమక్షంలో ఆర్ఓఆర్ ప్లాంట్‌ల ప్రారంభోత్సవం జరిగింది. త్రాగునీటి వసతులు సక్రమంగా లేక అవస్తలు పడుతున్న ప్రజలకు శుద్ధి చేసిన మంచినీటిని అందించే అపూర్వ అవకాశం విపిఆర్ ఫౌండేషన్‌కు లభించడం ఎంతో అదృష్టమని విపిఆర్ అన్నారు. ఆయా గ్రామ పంచాయతీ ప్రజల అభ్యర్ధనల మేరకు, వారి సహకారంతో విజయవంతంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని, ముఖ్యంగా ఫ్లోరైడ్, టిడిఎస్ వంటి నీటి సమస్యలతో, ఇతరత్రా అసమానతలతో బాధలు పడుతున్న ప్రజలకు శుద్ధిచేసిన మంచినీటిని అందించే ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో జిల్లావ్యాప్తంగా 100 వాటర్‌ప్లాంట్‌లను నెలకొల్పడానికి సమాయత్తమవుతున్నామన్నారు. యువతను ప్రోత్సహించాలనే సదాశయంతో 'విపిఆర్ వికాస్' కార్యక్రమాన్ని రూపొందించామని, యువ క్రీడాకారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. విపిఆర్ వికాస్ కార్యక్రమం ద్వారా యువతకు క్రికెట్ కిట్‌లు, వాలీబాల్ కిట్‌లు అందజేశారు. గ్రామీణప్రాంతాల్లోని యువతను క్రీడల్లో ప్రోత్సహించడం ద్వారా వారిలో ఉన్న అపూర్వమైన క్రీడాప్రతిభను మెరుగుపరచినట్లవుతుందన్నారు. వారు ప్రతిభతో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడల్లో రాణించి వారి గ్రామాలకు, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆయన కోరారు. జిల్లాలోని ప్రజలందరూ విపిఆర్ ఫౌండేషన్ అందజేస్తున్న ఈ కార్యక్రమాలను అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొఫెసర్ వి.నారాయణరెడ్డి, చీఫ్ కో-ఆర్డినేటర్ ఎన్.శంకర్, సింహపురి హాస్పిటల్స్ అధినేత కె.రవీంద్రరెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు, విపిఆర్ వికాస్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసుల్లో ప్రకంపనలు



జిల్లా ఎస్పీగా కొత్తకోట శ్రీనివాసరెడ్డిది ఒక స్టైల్. కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డిది ఇంకో శైలి. మల్లారెడ్డి మరో రకం. విశాల్ గున్నీ ఇంకోరకం... ప్రస్తుతం పి.హెచ్.డి.రామకృష్ణది విభిన్న శైలి. ఎస్పీలుగా ఎవరు వచ్చినా ఒక్కొక్కరి పని ఒక్కో రకంగా వుంటుంది. ఒక్కొక్కరి టార్గెట్ ఒక్కో రకంగా వుంటుంది. కె.శ్రీనివాసరెడ్డి ఎస్పీగా వుండగా రౌడీయిజాన్ని అణచివేశాడు. నెల్లూరులో ట్రాఫిక్‌ను అదుపులో పెట్టాడు. బి.వి.రమణకుమార్ ఎస్పీగా వుంటే 'క్యాప్' అనే ప్రాజెక్ట్‌కు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి బోడిగాడితోటలోని పిల్లలను చదివించడానికి ఎక్కువ సమయం కేటాయించేవాడు. విశాల్‌గున్నీ అయితే సి.సి కెమెరాల ఏర్పాటు, పోలీసుగ్రౌండ్ అభివృద్ధి వంటి వాటికి పెద్దపీట వేశాడు.

ప్రస్తుత ఎస్పీ రామకృష్ణ మాత్రం ముందు సొంత ఇంటిని చక్కదిద్దుకోవడం పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాడు. ముందు పోలీసు శాఖ బాగుంటే ఆటోమేటిగ్గా జిల్లాలో అన్నీ సర్దుకుంటాయన్నది ఆయన ఉద్దేశ్యంలాగుంది. క్రికెట్ బెట్టింగ్, ఇసుక, సిలికా, ఎర్రచందనం అక్రమ రవాణా వంటి వాటిని అరికట్టడం ఆయన టార్గెట్. జిల్లాలోని కొందరు పోలీసుల సహకారంతోనే ఇంతకాలం నుండి ఇవి జరిగిపోతున్నాయనే విషయం ఆయనకు అర్ధమైంది. క్రికెట్ బెట్టింగ్ కేసులను లోడితేనే బెట్టింగ్ ముఠాలతో పోలీసులకు ఉన్న సంబంధాలు బయటపడ్డాయి. ఇక ఎర్రచందనం, సిలికా, ఇసుక అక్రమ రవాణాలకు కూడా పోలీసు సహకారం అందుతుందన్నది ఆయన దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే ముందు పోలీసు శాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాడు. ఇటీవల ఆయా పోలీసుస్టేషన్‌లలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన సిబ్బందిని కదిలించారు. మినిస్టీరియల్ సిబ్బందిని భారీ ఎత్తున బదిలీ చేసారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నందుకు ఇటీవల జరిగిన క్రైం మీటింగ్‌లో ఇద్దరు డిఎస్పీలకు, 10మంది సిఐలకు ఛార్జిమెమోలు జారీ చేసారు. ఇక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న గూడూరు టూటౌన్, దగదర్తి ఎస్ఐలపై సస్పెండ్ వేటు వేసి అవినీతి పోలీసు అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. జిల్లా ఎస్పీ దెబ్బకు ముందు రౌడీలు, కేటుగాళ్ళేమోగాని పోలీసులే వణికిపోతున్నారు. ఇప్పటివరకు ఒక విధమైన పనితీరుకు అలవాటుపడ్డ పోలీసులకు ఎస్పీ రామకృష్ణ ఆలోచనలకు తగ్గట్లుగా, ఆయన వేగానికి తగ్గట్లుగా పని చేయడం కష్టంగానే వుంది.

# సిఇజడ్‌తోనన్నా... దశ తిరిగేనా?



***ప్రధాని నరేంద్ర మోడీ... ముఖ్యమంత్రి చంద్రబాబు... మాటలను కోటలు దాటిస్తారు. అరచేతిలో స్వర్గం చూపిస్తారు. ఆచరణకొచ్చే సరికి ఏమీ ఉండదు. 2014లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వాలు వచ్చాక నెల్లూరు జిల్లాలో పదిమందికి పని కల్పించే విధంగా ఈ ప్రాజెక్ట్ వచ్చింది, ఈ పరిశ్రమ వచ్చింది అని చెప్పుకోవడానికి ఒక్కటీ లేదు. మూడున్నరేళ్ళుగా మాటలు చెబుతూనే వున్నారు. అక్కడ అది, ఇక్కడ ఇది అంటూ ఇంకా చెబుతూనే వున్నారు.***

విశాఖ-చెన్నై, బెంగుళూరు - చెన్నై కారిడార్‌లలో కృష్ణపట్నం పోర్టును కలిపారు. ఈ కారిడార్‌లు వస్తే పారిశ్రామికంగా నెల్లూరు జిల్లా ఎక్కడికో పోతుందనుకున్నారు. ఇంతవరకు ఈ కారిడార్ల నిర్మాణంపై ఎలాంటి కదలికలు లేవు. కనీసం సర్వే కూడా జరిగినట్లు లేదు. కేంద్రం కృష్ణపట్నం పోర్టును ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా బడ్జెట్‌లో చూపించిందేగాని, తర్వాత ఆచరణకు తగ్గ విధివిధానాలు లేవు. బకింగ్‌హామ్ కెనాల్ ద్వారా జల రవాణా అభివృద్ధి అన్నారు. ఇంతవరకు దానిపై అడుగు ముందుకు పడలేదు. దుగరాజపట్నం పోర్టు హామీ అటకెక్కినట్లే! దామవరం వద్ద ఎయిర్‌పోర్టు ఇంకా ఊగిసలాడుతూనే వుంది. నెల్లూరుజిల్లాకు రావాల్సిన 'కియో మోటార్' అనంతపురం జిల్లాకు తరలిపోవడం చూసాం. వాళ్ళు ఇఫ్కో భూములు అడిగారు. అవివ్వడం సాధ్యం కాదని తేల్చేసరికి అనంతపురం చూసుకున్నారు.

వై.యస్. మరణం తర్వాత జిల్లాలో పారిశ్రామిక వేగం ఆగిపోయింది. అడుగులు ముందుకు పడడం లేదు. ఈ దశలో వున్న ఒకే ఒక ఆశ కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్. కేంద్రం కృష్ణపట్నం పోర్టు కేంద్రంగా సి.ఇ.జడ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం, ఈ మేరకు కేంద్ర బృందాలు వచ్చి పరిశీలించడం జరిగింది. పాతిక వేల ఎకరాల విస్తీర్ణంలో సిఇజడ్ ఏర్పాటు కానుంది. ఈమేరకు భూసేకరణ కూడా జరుగుతోంది. సిఇజడ్ పరిధిలోకి త్వరలోనే రెండు భారీ పరిశ్రమలు రానున్నట్లు తెలుస్తోంది. సి.ఇ.జడ్ ఆచరణలోకి వస్తే జిల్లాలో ఆగిన పారిశ్రామిక ప్రగతి చక్రం ముందుకు కదిలే అవకాశముంది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

నెల్లూరు కబుర్లు

# కొత్త సంవత్సరంకు ముస్తాబు

నెల్లూరు నగరంలో వ్యాపార సంస్థలు కొత్త సంవత్సర వేడుకలకు ముస్తాబవుతున్నాయి. డిసెంబర్ 31, జనవరి 1 తేదీలలో పెద్దఎత్తున వ్యాపారం జరుగుతుంటుంది. మద్యం షాపులు, బార్‌లు, రెస్టారెంట్లు, పూలకొట్లు, బొకేలు, స్వీట్స్, బేకరీలు, ఫ్రూట్స్, డైరీలు.. ఈ వ్యాపారాలు బాగానే జరుగుతాయి. ఈసారి డిసెంబర్ 31వ తేదీ ఆదివారం రావడంతో మద్యం, రెస్టారెంట్‌ల వ్యాపారం పెరిగే అవకాశం కూడా వుంది. ఈమేరకు వైన్‌షాపులు, బార్‌లలో భారీఎత్తున మద్యం స్టాక్ పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. కాగా, నోట్ల రద్దు, జిఎస్టీ ప్రభావం కూడా తమ వ్యాపారాలపై పడొచ్చనే ఆందోళన వ్యాపారుల్లో వుంది. నోట్లు రద్దయినా మద్యం అమ్మకాలు మాత్రం తగ్గవు... దానికి పక్కా గ్యారంటీ!

# బ్రాహ్మణ సేవాసంఘానికి విపిఆర్ చేయూత

ప్రముఖ పారిశ్రామికవేత్త, వితరణ శీలి, దాత, విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య భవన నిర్మాణానికి ఇటీవల రూ. 5లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షులు చలపతిరావు మాట్లాడుతూ నెల్లూరుజిల్లా గూడూరులో నూతనంగా నిర్మిస్తున్న భవనానికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ. 5లక్షలు విరాళం అందజేయడం చాలా సంతోషదాయకమన్నారు. జిల్లా వ్యాప్తంగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు, పేద పిల్లలకు ఉచిత కార్పొరేట్ విద్యను అందించడం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ వంటి సేవలు చేస్తున్న వేమిరెడ్డికి జిల్లా ప్రజలు రుణపడి వుంటారన్నారు. శ్రీనివాసరావు, లలిత, నాగరాజారావు, రామమోహన్‌రావు, ఆనిమెళ్ళ శివకుమార్, నాదబ్రహ్మం పాల్గొన్నారు.



బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సభ్యులకు విరాళాన్నందజేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

# విశ్వసాయిలో వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థినులు

నెల్లూరు, వనంతోపు సెంటర్‌లో వున్న విశ్వసాయి జూనియర్ కళాశాలలో 14వ తేదీ జీవశాస్త్ర వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా 9, 10 మరియు ఇంటర్మీడియట్ తరగతుల విద్యార్థులు జీవశాస్త్రంలో అధ్యయనం చేసే వివిధ రకాల ఫల, పుష్ప, జంతువులను, వాటి శాస్త్రీయ నామాలు, మానవ అంతర్నిర్మాణంలోని వివిధ అవయవాలైన గుండె, ఊపిరితిత్తులు, జీర్ణాశయం, మెదడు, మూత్రపిండాలు, ప్రత్యుత్పత్తి భాగాలతో పాటుగా, అస్థిపంజర వ్యవస్థను ప్రదర్శనకు ఉంచారు. వివిధ రకాల ఔషధ, తృణ ధాన్య, ఆర్థిక ప్రాముఖ్యత కలిగిన మొక్కలు, విషతుల్య మొక్కలను ప్రదర్శించారు. జీవశాస్త్ర విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో, ఫ్లవర్ కార్పెట్‌లు, హెర్బేరియం, చార్టులు, నమూనాలు ప్రదర్శించారు.

వివిధ రకాల జంతువులను, అరుదుగా కనిపించే కొన్ని చేపలు, తాబేళ్ళను ప్రదర్శనలో ఉంచారు. రక్తపరీక్షలను నిర్వహించి, రక్త గ్రూపులను కూడా తెలియజేశారు. ఈ జీవశాస్త్ర విద్యా వైజ్ఞానిక ప్రదర్శన వల్ల విద్యార్థులకు, పరిసరాల పట్ల మొక్కలు, జంతువుల పట్ల అవగాహన ఏర్పడుతుందని ఆ సంస్థల డైరెక్టర్లు డా॥ యన్.సత్యనారాయణ, జి.కృష్ణమోహన్ తెలిపారు.

# అలరించిన సంఘ్‌ఘోష్



నెల్లూరులోని గోమతి నగర్‌లో నందు 9, 10 తేదీలలో ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతులలో పాల్గొన్న దానికిగాను బాలాజీనగర్‌లోని అన్నపూర్ణ అపార్ట్‌మెంట్ సెంటర్ నుండి పుట్టవీధి, ఆదిత్యనగర్, అపోలో హాస్పిటల్‌ల మీదుగా సంఘ్ కార్యకర్తలతో నిర్వహించిన ఘోష్ పద సంచలనం ఎంతో ఆసక్తికరంగా దేశ భక్తి ఉప్పొంగేలా సాగింది. ఆరెస్సెస్ విభాగ ప్రచారక్ శ్రీనివాసులురెడ్డి, ప్రాంత సహకార్యవాహ్ ఆచార్య ఆదిత్య, ఆరెస్సెస్ నగర అధ్యక్షులు డాక్టర్ సి.వి.సుబ్రహ్మణ్యం, సుబ్బారావులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.




ప్రత్తి సూర్యనారాయణశెట్టి(సూరి) గారు

జననం: 10.10.1928 మరణం: 17.12.2006

11వ వర్ధంతి

(ప్రత్తి సూరి)

నడత నేర్పారు... నడక నేర్పారు...
నలుగురితో మంచిగా మెలిగే క్రమశిక్షణను నేర్పారు...
బ్రతుకునిచ్చారు, భవిష్యత్తునిచ్చారు...
బాధలను ఎదుర్కొనే ధైర్యానిచ్చారు...
మా ఆశ మీరే, మా ఆశయం మీరే...
మీరు చూపిన మార్గం మాకు ఆదర్శం...
మీరు మా నుండి భౌతికంగానే దూరమయ్యారు...
కాని, ప్రతిక్షణం మా జ్ఞాపకాలలో జీవించే వున్నారు.
మా తండ్రిగారైన

శ్రీ ప్రత్తి సూర్యనారాయణశెట్టి(సూరి) గారు

మమ్ము వీడి దైవసన్నిధికి చేరి
11 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా
ఆ మహనీయుడిని స్మరించుకుంటూ...

కుమారులు:
ప్రత్తి వసంతకుమార్
ప్రత్తి ధనరాజ్
ప్రత్తి గోపాలకృష్ణ
ప్రత్తి నరసింహం
ప్రత్తి శ్రీనివాసులు
మరియు
మనవళ్ళు, మనవరాళ్ళు

### ఆధునిక సేద్యంతో...

# అన్నదాతల ఆత్మహత్యలకు బ్రేక్!

## - వ్యవసాయం మంత్రి సోమిరెడ్డి



ప్రత్యేక గ్రీవెన్స్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తీసుకొస్తున్న ఆధునిక అభివృద్ధి, యాంత్రీకరణ, సంక్షేమ కార్యక్రమాల వల్ల అన్నదాతల ఆత్మహత్యలు చాలావరకు తగ్గాయని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 10వ తేదీ ముత్తుకూరు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అధికారులందరినీ ఒకేచోట చేర్చి ప్రజల విజ్ఞప్తులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారని, వెంటనే అయ్యే సమస్యలను అప్పుడే పరిష్కరిస్తారని, మిగిలిన వాటిని జనవరిలో జరిగే జన్మభూమి కార్యక్రమంలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి 25.6 శాతంగా వుందని చెప్పారు. పండ్ల తోటల పెంపకంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో వుందని చెప్పారు. రైతురథం క్రింద రాష్ట్రంలో 12,500 ట్రాక్టర్లు మంజూరయ్యాయన్నారు. బిల్‌గేట్స్ ఫౌండేషన్ సహకారంతో భూసార పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూక్ష్మ పోషకాలను 70వేల టన్నుల మేరకు అందించడం జరుగుతుందని చెప్పారు. అర్హత వుండి వివిధ కారణాల వల్ల ఋణమాఫీ పొందని రైతులందరికీ ఋణమాఫీ అమలయ్యేలా చేస్తామని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కిలారి వెంకటస్వామి నాయుడు, జడ్పీటీసీ ఎన్.శివప్రసాదరెడ్డి, వ్యవసాయశాఖ జె.డి చంద్రనాయక్, డి.ఇ.ఓ శామ్యూల్, ఆర్డీఓ హరిత, డిఆర్ డిఏ పి.డి లావణ్యవేణి, తహశీల్దార్ చెంచయ్యలు పాల్గొన్నారు.

# ఓటు నమోదుకు తరలిరండి



రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇంతియాజ్

ఎన్నికల సంఘం వారి ఆదేశాలననుసరించి ఈ నెల 15 నుండి 31వ తేదీ వరకు ప్రస్తుతమున్న ఓటర్ల జాబితాకు సంబంధించి అభ్యంతరాలు, మార్పులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎ.ఎం.డి ఇంతియాజ్ తెలిపారు. 9వతేదీ పోలింగ్ కేంద్రాల పునర్ వ్యవస్థీకరణపై అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇంతియాజ్ మాట్లాడుతూ 2018 సంవత్సరం జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఓటు హక్కు కల్పిస్తామని తెలిపారు. కొత్త ఓటర్లు ఫాం-6ను పూర్తి చేసి సమర్పించాలని సూచించారు. క్లెయిములు, అభ్యంతరాలను అన్ని పోలింగ్ కేంద్రాలలోను, తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాలు, ఓటరు నమోదు అధికారి కార్యాలయాల్లో స్వీకరిస్తారని ఆయన వెల్లడించారు. అందుకుగాను ఈ నెల 17, 24 తేదీల్లో ఎన్నికల యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారని, జనవరి ఒకటో తేదీన అభ్యంతరాలను నివృత్తి చేస్తారని, జనవరి 13 నాటికి జాబితాను సిద్ధం చేసి జనవరి 15న కొత్త ఓటర్ల జాబితాను ముద్రిస్తామని, కొత్త జాబితాను జనవరి 20న ప్రకటిస్తామని వెల్లడించారు. బూతు స్థాయి అధికారులు తమ గ్రామసభ, వార్డు సభలలో చనిపోయిన, వలసపోయిన, మారిపోయిన ఓటర్ల వివరాలు, జనవరి 1 నాటికి అర్హులైన ఓటర్ల వివరాలు సేకరించి నమోదు చేసి సంబంధిత ఓటర్ల నమోదు అధికారికి సమర్పించాలని ఆయన కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లు జాబితాలను తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా కలెక్టర్లకు వెంటనే సమర్పించాలని, తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీలో బూత్ లెవల్ ఏజెంట్లు ముఖ్యపాత్ర పోషించాల్సి వుంటుందని ఇంతియాజ్ తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నుండి బి.మనోహర్‌రెడ్డి, బీజేపీ నుండి వై.రాజేష్, వైసిపి నుండి డి.మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధుల ముసుగులో వ్యాపారం నివారించాలి

- నెల్లూరులో అట్టహాసంగా చర్మవ్యాధి వైద్యుల రాష్ట్ర సదస్సు




సదస్సులో ప్రత్యేక సావనీర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ డెర్మటాలజిస్ట్, వెనిరియోలజిస్ట్ అండ్ లెప్రోలజిస్ట్స్ రాష్ట్ర సదస్సు ఈ నెల 9 మరియు 10వ తేదీలలో నెల్లూరు, అన్నమయ్య సర్కిల్‌లోని పివిఆర్ కళ్యాణ మండపంలో విజయవంతంగా జరిగింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి 500మంది చర్మవ్యాధి సంబంధిత వైద్య నిపుణులు ఈ సదస్సుకు హాజరు కావడం విశేషం. అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ రమేష్‌భట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చర్మ వ్యాధులతో చాలా కంపెనీలు వ్యాపారం చేస్తున్నాయని, వ్యాధిని వ్యాధిగానే చూడాలిగాని వ్యాపారం దృష్టితో కాదన్నారు. చర్మ వ్యాధులు వచ్చినప్పుడు సంబంధిత వైద్యులను సంప్రదించి వారు సూచించిన మందులను వాడాలేగాని, మార్కెట్‌లో దొరికే ఏ క్రీములంటే ఆ క్రీములు వాడొద్దని, వీటి వల్ల చర్మవ్యాధులు తగ్గకపోగా అవి మరింతగా ముదిరే అవకాశం ఉంటుందని చెప్పారు. పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం వల్లే చర్మవ్యాధులు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వస్తున్నాయని చెప్పారు. చర్మ సౌందర్యం కోసం టీవీలలో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దని, చర్మాన్ని సౌందర్యంగా కంటే ఆరోగ్యంగా ఉంచుకోవాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షులు, సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ పర్వతరెడ్డి పెంచలరెడ్డి మాట్లాడుతూ చర్మవ్యాధుల వైద్యరంగంలోనూ నకిలీలు తయారవుతున్నారని, ఎలాంటి విద్యార్హత, సర్టిఫికేట్లు లేకుండా కాస్మటాలజిస్టులుగా అవతారమెత్తి వ్యాధిగ్రస్తులతో ఆడుకుంటున్నారని పేర్కొన్నారు. చర్మవ్యాధుల వైద్యరంగంలో అనేక ఆధునిక చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. జుట్టు రాలడం, మొటిమలకు ఆధునిక చికిత్స అందుబాటులో వుందన్నారు. సదస్సులో ఇంకా పలువురు వైద్య నిపుణులు తమ పరిశోధనాపత్రాలను సమర్పించారు.

ఈ సదస్సులో ఏ.పి మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ జి.అశోక్, సదస్సు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ సి.భాస్కర్‌రావు, సైంటిఫిక్ కమిటి ఛైర్మన్ డాక్టర్ ఎ.విజయమోహన్‌రావు, అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఎ.సుమలతారెడ్డి, కోశాధికారి డాక్టర్ ఎం.కాశయ్య, సదస్సు కోశాధికారి డాక్టర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బాలికా విద్య చైతన్యయాత్రకు...

# ఎంఎస్ఆర్ సేవాసమితి ఆహ్వానం



బాలికా విద్య పై ప్రజల్లో చైతన్యం నింపేందుకు జగత్‌సింగ్ గాంధీ ప్రారంభించిన సైకిల్‌యాత్రకు 10వ తేదీన నెల్లూరులో మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవా సమితి సభ్యులు ఘనస్వాగతం పలికారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ యాత్ర కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరుజిల్లాల మీదుగా నెల్లూరుకు చేరుకుంది. మాగుంట శరత్‌చంద్రారెడ్డి పిలుపు మేరకు సేవాసమితి సభ్యులు నెల్లూరులో వారికి అన్ని వసతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో మాగుంట వెంకటనారాయణరెడ్డి, హరికిషన్‌రెడ్డి, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# వాకర్స్‌కు దంత వ్యాధుల అవగాహన సదస్సు




ప్రసంగిస్తున్న డాక్టర్ లహరి

నెల్లూరు ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లియో డెంటల్ వైద్యశాల వారి సహకారంతో ఈ నెల 10వ తేదీన ఏసి స్టేడియం వాకర్స్‌కు దంత సమస్యలపై అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ లహరి, డాక్టర్ ఫిరోజ్ దంత పరీక్షలు నిర్వహించి చిగుళ్ళ వాపు, రక్తం కారుట, నోటి దుర్వాసన తదితర దంత సమస్యలపై అవగాహన కల్పించారు. వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, యస్.రాఘవేంద్ర షెట్టి, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ సత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డు కుటుంబానికి చేయూత



హోంగార్డ్ కుటుంబానికి చెక్కునందజేస్తున్న డిఎస్పీ శ్రీనివాసరావు

ఇటీవల విధి నిర్వహణలో మరణించిన హోంగార్డు యం.రామచంద్రరావు కుటుంబానికి తోటి హోంగార్డులందరు కలిసి తమ ఒకరోజు వేతనం 23,200 రూపాయలను సాయంగా అందించారు. 11వ తేదీ పోలీసు కార్యాలయంలోని హోంగార్డు ఆఫీసు నందు రామచంద్రరావు భార్య శ్రీమతి యం.కోటేశ్వరమ్మకు హోంగార్డ్స్ డిఎస్పీ కొల్లూరి శ్రీనివాసరావు ఈ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ ఆర్.ఐ కెజెఎం చిరంజీవి, సీనియర్ అసిస్టెంట్ వెంకయ్య, ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు, కడియంపాటి రవిబాబు, బి.రామారావు, యం.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేకశ్రద్ధ

## • కోదండ రామాంజనేయస్వామి దేవాలయానికి నూతన పాలకవర్గం


పాలక మండలి సభ్యుల చేత ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, బీద రవిచంద్ర, పొనకా దేవసేన

గూడూరు పట్టణంలోని కోనేటిమిట్ట ప్రాంతంలో కోదండ రామాంజనేయ స్వామి దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల ఘనంగా నిర్వహించారు. ఛైర్మెన్‌గా బత్తిన సుధాకర్, పాలకమండలి సభ్యుల చేత ప్రమాణ స్వీకారాన్ని చేపట్టారు. అంతకుముందు నాయకులకు, కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. భారీ బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం దాతల సహకారం తీసుకుని అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేవాలయాల ఆస్తులను సంపూర్ణంగా సంరక్షించి, ధూపదీప నైవేద్యాలకు కొదవ లేకుండా పాలకమండలి కృషి చేయాలని సూచించారు. ఇంకా ఛైర్మెన్ బత్తిన సుధాకర్, పలువురు మాట్లాడుతూ చిత్తశుద్ధి, భక్తిభావంతో దేవాలయాలను అభివృద్ధి పరచడంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాజధాని నిర్మాణ సలహామండలి సభ్యుడు బీద మస్తాన్‌రావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, ప్రజా ప్రతినిధులు, దేవాదాయ శాఖ, పలు శాఖల అధికారులు ఉన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# రోటరీ ఫలసరుకుల పంపిణీ


వృద్ధులకు ఫలసరుకులు అందజేస్తున్న రోటరీ అధ్యక్షులు మునిరాజా, బాలకృష్ణంరాజు

దివ్యాంగులను, వృద్ధులను ఆదుకోవడంలో రోటరీ హెల్పేజ్ ద్వారా సహాయసహకారాలు అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు అని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మునిరాజా, కార్యదర్శి బాలకృష్ణంరాజు తెలిపారు. గూడూరు పట్టణంలోని రోటరీ భవనంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ ఫల సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పేదలకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి నెల క్రమం తప్పకుండా ఫలసరుకులు అందించడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఉంటే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు. ప్రతిఒక్కరు దాతలు అందిస్తున్న సహాయాన్ని ఎన్నడూ కూడా మరవకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు దశరథరామిరెడ్డి, మయూరి శ్యాంయాదవ్, రఘురామిరెడ్డి, మల్లయ్య, దయాకర్‌రెడ్డి, కె.మునిగిరీష్, నాగేంద్రప్రసాద్, జానకిరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

# విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపేది గురువులే!


సత్కారాన్నందుకుంటున్న పురందర్‌రాజు దంపతులు

గురువుకు ఉన్న గొప్పతనం సమాజంలో మరవకూడదని, విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపేది గురువు మాత్రమేనని నెల్లూరులోని ప్రభుత్వ బిఇడి కళాశాల ప్రిన్సిపాల్ మువ్వా రామలింగం అన్నారు. గూడూరు మండలం దివిపాళెం పంచాయతి చవటపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు పురంధర్‌రాజుకు పూర్వ విద్యార్థుల అభినందన సభను ఇటీవల నిర్వహించారు. ఈ సందర్భంగా మువ్వా రామలింగంతో పాటు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కాంచన తదితరులు మాట్లాడారు. చదువుకు ఉన్న విలువ, ప్రాముఖ్యత తెలుసుకుంటే ప్రతిఒక్కరూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుతారన్నారు. పేదరికం ఎప్పుడూ చదువుకు అడ్డు ఉండదని, పట్టుదల, క్రమశిక్షణ, అకుంఠిత దీక్ష ఎవరికైతే ఉంటుందో ఖచ్చితంగా ముందుకు సాగుతారని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పిట్టి నాగరాజు, సురేంద్ర, ఉపాధ్యాయులు ఉన్నారు.

# క్రికెట్‌లో సత్తా చూపిన ఎల్ఏపి విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి

జిల్లాలోని వెంకటగిరిలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో గూడూరు ఎల్ఏపి విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి సత్తా చాటారు. ఎల్ఏపి విద్యార్థులు క్రికెట్ పోటీలలో విజయం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో వచ్చే నెలలో వైజాగ్‌లో నిర్వహించనున్న పోటీలలో పాల్గొనడానికి సిద్ధమవుతున్నారని, ఈ పోటీలలో 13జిల్లాల నుండి క్రీడాకారులు హాజరవుతారని పాఠశాల యాజమాన్యం బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వెంకటగిరిలోని తారక రామారావు క్రీడామైదానంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో పాఠశాలకు చెందిన క్రీడాకారులు గెలుపొందడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ రమేష్, ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయబృందం, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# రెయిన్‌బో గేమ్స్ గాలా


జాతీయ జెండాను ఎగురవేసి క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి సోమిరెడ్డి



'సేవ్ రివర్స్' మస్కట్‌ను గాలిలోకి వదులుతున్న మాజీమంత్రి ఆదాల

నెల్లూరు ధనలక్ష్మిపురం, కలివెలపాళెంలో ఉన్న రెయిన్‌బో సిబిఎస్ఇ స్కూలులో ఈ నెల 9న గేమ్స్‌గాలా – 2017 పేరుతో క్రీడాపోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సోమిరెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ అంతే ప్రాముఖ్యత ఇవ్వాలని, ప్రస్తుతం చాలా పాఠశాలలు కేవలం విద్యకే ప్రాముఖ్యతనిస్తున్నాయని, దీంతో విద్యార్థులకు తగిన వ్యాయామం అందడం లేదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, మాస్ డ్రిల్, కర్రసాము అద్భుతంగా ఉన్నాయంటూ మంత్రి ప్రశంసించారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్, నగర కమిషనర్ ఢిల్లీరావు, పాఠశాల అకడమిక్ డెవలపర్ మాలతి వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే, నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో స్కూల్ వారి వార్షిక క్రీడోత్సవాలను గేమ్స్ గాలా – 2017 పేరుతో నెల్లూరు రూరల్ మండలం కలివెలపాళెం గ్రామంలో ఈ నెల 10న జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి, నెల్లూరుజిల్లా సిండికేట్ బ్యాంక్ సీనియర్ రీజనల్ మేనేజర్ బాలకృష్ణ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి 'సేవ్ రివర్స్' అనే మస్కట్‌ను గాలిలోకి వదిలి గేమ్స్‌గాలా – 2017ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన రన్నింగ్ రేస్, ట్రిబుల్ జంప్, కబడి, ఫ్రాగ్ జంప్ తదితర క్రీడలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మాజీమంత్రి ఆదాల మాట్లాడుతూ విద్యార్థులందరూ అన్ని రంగాల్లో రాణించి అభివృద్ధి చెంది ఉత్తమ భావిభారత పౌరులుగా ఎదగాలని కొనియాడారు. ప్రతి ఒక్కరు మాతృభాషను మరువకుండా అన్ని భాషలను అధ్యయనం చేయాలన్నారు. పిల్లల్ని అన్ని రంగాల్లో అగ్రగాములుగా తీర్చిదిద్దిన స్కూలు యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ అరుణ స్వయంప్రభ, పిఇటిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రిస్టమస్ ఫుట్‌బాల్ పోటీలు


విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ముక్కాల ద్వారకానాథ్

క్రిస్టమస్‌ను పురస్కరించుకుని నెల్లూరు సంతపేటలోని సెయింట్ జోన్స్ హైస్కూల్ నందు వైసిపి నాయకులు కాయల సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఇటీవల ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం జట్టు ప్రథమ బహుమతిని, కానుకమాత జట్టు ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. జూనియర్స్ విభాగంలో సెయింట్ జోన్స్ స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. 11వ తేదీ జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, ఫాదర్ జార్జి విలియమ్స్, కార్పొరేటర్ ఓబిలి రవిచంద్రలు విచ్చేసి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.బాలప్రసాద్, ఎ.కల్పన, జి.జె.సత్యానందం, ఎ.కానికృం, సరిత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# సేద్య పరికరాల కొరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

నెల్లూరుజిల్లాలోని రైతులు బిందు, తుంపర్ల సేద్య పరికరాల కొరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వి.రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ పోను రైతు కట్టాల్సిన నగదును ఎంఐఎకు గాని, లేదా డ్రిప్, స్ప్రింకర్లు అందించే కంపెనీలకు గాని నగదును బ్యాంకు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పి.డి, ఎపియంఐపి, నెల్లూరు పేరుతో తీసి రైతులను కలిసే వారి పేరు వివరాలు, ఫోను నెంబరు, కంపెనీ పేరు తెలుసుకుని ఇవ్వాలని కోరారు. జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు డ్రిప్ కంపెనీలకు నగదుగా ఇవ్వద్దని, డి.డిలు మాత్రమే ఇవ్వాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ కోరారు.

శ్రీను గల్పిక

# లోకేష్‌ను ఐకాన్‌గా తీసుకున్న బిల్‌గేట్స్

ఉండవల్లిలోని హైటెక్ రత్న చంద్రబాబు నివాసం. రాజమౌళిని తీసుకుని అమరావతి పరిసరాలన్నీ చూపించి, ఎక్కడ కోటలు రావాలి, ఎక్కడ కందకాలు తవ్వాలి, ఎక్కడ అశ్వదళాలు, గజదళాల శాలలు నిర్మించాలన్న దానిపై ఆయనకు సూచనలిచ్చి చంద్రబాబు అప్పుడే వచ్చాడు. హాల్‌లో కూర్చుని టీవీ ఆన్ చేసాడు. ఆ క్షణంలో ఆయనకు మనిషన్నాక కూసంత కళాపోషణ వుండాలి, లేకుంటే మనిషికి గొడ్డుకు తేడా ఏటుంటాది అనే ముత్యాలముగ్గు సినిమాలోని రావుగోపాలరావు డైలాగ్ గుర్తుకొచ్చింది. బాడీలో ఏబిసిడి విటమిన్‌లు లోపించినట్లే ఎంటర్‌టైన్‌మెంట్ అనే విటమిన్ లోపించినా కూడా ఆరోగ్యానికి మంచిది కాదని భావించిన చంద్రబాబు ఏదన్నా సినిమా చూసి తరిద్దామని 'మా' టీవీ ఛానెల్ పెట్టాడు. అల్లరి నరేష్ హీరోగా నటించిన 'సీమటపాకాయ్' సినిమా వస్తుంది. అందులో ఓ సన్నివేశం... అమెరికా నుండి బ్రహ్మానందం తన భార్య, కూతురును వెంటబెట్టుకుని పెద్ద కోటీశ్వరుడైన తన బావ షియాజీషిండే ఇంటికి వస్తాడు. అల్లరి నరేష్ అతని కొడుకే! ఆ పెద్ద భవంతిలో షియాజీషిండే, అతని భార్య సుధ, కొడుకు అల్లరి నరేష్, మిగతా కుటుంబసభ్యులు పనిమనుషుల్లాగా వుంటారు. పని మనుషులుగా వుండే ఎల్.బి.శ్రీరాం, గీతా సింగ్‌లు ఓనర్లుగా కనిపిస్తారు. ఏమైందిరా, ఇంత బికారులు ఎలా అయ్యారురా అని బ్రహ్మానందం అడుగుతాడు. అందుకు అల్లరి నరేష్... రాత్రి డ్రైవర్‌తో నాన్న పేకాట ఆడాడు. జోకర్ అతనికి పడింది, ఆస్తి మొత్తం అతనికే పోయింది అని చెబుతాడు. ఈ సీన్ చూసిన చంద్రబాబు పకపక నవ్వుతూ... నిజజీవితంలో ఇలాంటి వాళ్ళు కూడా ఉంటారేమోననుకుని, ఈరోజు విశేషాలేంటో చూద్దామని ఏబిఎఫ్ న్యూస్ ఛానెల్ పెట్టాడు. స్క్రీన్‌పై ఐ.టి మంత్రి లోకేష్ కనిపించేసరికి చంద్రబాబు ఆసక్తిగా ఆందోళనగా చూడసాగాడు. వీడేం మాట్లాడి ఏం నెత్తి మీదకు తెస్తాడోనని ఆయన బిత్తరబిత్తరగా వున్నాడు.

లోకేష్ ప్రెస్‌మీట్... ప్రతి ఏడాది ప్రకటించినట్లే ఈ ఏడాది కూడా ఆస్తులు ప్రకటించడానికే మీడియాను పిలిచాను. మాది చాలా పేదకుటుంబం... నేను పాలు అమ్ముకుంటే, మా నాన్న జున్ను, లస్సీ, మజ్జిగ అమ్ముతున్నారు. మా అమ్మ తోటకూర, పాలకూర కట్టలు, నా భార్య కూరగాయలు అమ్మగా వచ్చిన డబ్బులతోనే మేం బ్రతుకుబండిని నెట్టుకొస్తున్నాం. పాలు అమ్మగా వచ్చిన ఆదాయంతోనే దేవాన్ష్‌కు పాల డబ్బాలు కొంటున్నాం. ప్రతి నెల రేషన్‌షాపులో రెండు రూపాయల బియ్యం కొంటూ నాలుగు మెతుకులు తినగలుగుతున్నాం. ప్రతి ఏటా చంద్రన్న కానుక ఇస్తుండబట్టి సంక్రాంతి పండక్కి అరిసెలు చేసుకోగలుగుతున్నాం. ఏదో రూపాయి రూపాయి కూడబెట్టి జూబ్లీహిల్స్‌లో నాలుగు ఫ్లాట్లు, ఒక ఇల్లు, హెరిటేజ్ ఫ్యాక్టరీ కట్టుకున్నాం. అన్నీ అమ్ముకోగా, తెచ్చిన అప్పులు పోగా నా ఆస్తి 13కోట్లు అని చెప్పాడు.

అది వినగానే చంద్రబాబు షాక్ తిన్నాడు. వెంటనే భువనేశ్వరి, బ్రాహ్మణి అంటూ కేకేసాడు. ఏమైందండి అంటూ భువనేశ్వరి, మామగారు అంటూ బ్రాహ్మణి పరుగెత్తుకుంటూ వచ్చారు. చంద్రబాబు వారితో... ఏం చేస్తున్నాడు వాడు, పేకాట ఆడుతున్నాడా, ఇంకేమైనా చేస్తున్నాడా... తెలివైన వాడని లోకేష్‌కు బాధ్యతలు అప్పగిస్తే ఆస్తులను కర్పూరంలా కరిగించేస్తాడా... అని ఆవేశపడసాగాడు. అసలు ఏం జరిగిందండి అని భువనేశ్వరి అడిగింది. ఎమ్మెల్సీ ఎన్నికప్పుడు 300 కోట్లు వున్న ఆస్తులను ఇప్పుడు 13కోట్లకు తెచ్చాడు. ఎక్కడ పేకాట ఆడి ఈ ఆస్తులన్నీ పోగొట్టుకున్నాడో... వచ్చాక నిలదీసి అడగండి అని బాధ్యతగల తండ్రిగా చెప్పాడు. అప్పుడే నైట్‌రైడర్, ముదురుదోమల శాఖ మంత్రి పి.నారాయణ అక్కడకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. సార్, వరల్డ్ రిచ్చెస్ట్ పర్సన్స్ అందరూ మన లోకేష్‌ను ఆదర్శంగా తీసుకుని ఆస్తులు ప్రకటిస్తున్నారు. ఒక్కసారి 'టైమ్స్ నౌ' ఇంగ్లీష్ ఛానెల్ పెట్టండి అని అడిగాడు. ప్రపంచ కుబేరులందరూ లోకేష్‌ను ఐకాన్‌గా తీసుకోవడమేంటనుకుంటూ చంద్రబాబు ఆ ఛానెల్ పెట్టాడు.

ప్రపంచంలో మేటి కోటీశ్వరుడు బ్రూనైసుల్తాన్ ఆస్తుల ప్రకటన... పాడుబడిన కోట పాతిక లక్షలు, తుప్పు పట్టిన విమానాలు నాలుగు 10లక్షలు, పది హెలికాప్టర్‌లు, నాలుగు వేల ఎకరాల భూములు, వెయ్యి కిలోల బంగారం... అంతా కలిపి నా ఆస్థి విలువ నాలుగు కోట్లు...

ప్రపంచ పారిశ్రామిక దిగ్గజం ఆలీబాబా...

చిరిగిన చొక్కాలు పది, కుట్లు పిగిలిన ఫ్యాంట్లు పాతిక, 30 దేశాలలో ఇండస్ట్రీస్, 300 బ్యాంకులలో అకౌంట్లు, నాలుగు టన్నుల గోల్డ్, 10వేల ఎకరాల పొలాలు, మొత్తం ఆస్థి విలువ 4.15 కోట్లు...

ఐ.టి దిగ్గజం బిల్‌గేట్స్...

రంగులు వెలసిన ఇల్లు, అన్ని దేశాలలోనూ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, పది జతల బట్టలు, నాలుగు జతల బూట్లు, ఒక పెంపుడు కుక్క... మొత్తం ఆస్థి విలువ 10.24 కోట్లు.

రిలయన్స్ అధినేత ముఖేష్ అంబాని...

రెండు విమానాలు, నాలుగు హెలికాప్టర్‌లు, రెండు రాష్ట్రాలలో చమురు కంపెనీలు, నాలుగు రాష్ట్రాలలో విద్యుత్ ప్రాజెక్టులు, 29 రాష్ట్రాలలో మాల్స్, ముంబైలో 30 అంతస్థుల భవనం... అన్నీ కలిపి ఆస్థి విలువ 7.24కోట్లు.

టీవీలో ఇక్కడితో ఆస్తుల ప్రకటనలు ముగిసాయి. న్యూస్ రీడర్ మళ్ళీ అదే అంశాన్ని కొనసాగిస్తూ... వీళ్ళంతా స్వచ్ఛంధంగా ఆస్తులు ప్రకటించడానికి ముఖ్య కారణం ఏపి ఐ.టి మంత్రి లోకేష్. ఎంత ఎదిగినా ఒదిగి వుండాలని, ఎన్ని కోట్లు సంపాదించినా తిండికి టికానా లేనట్లే వుండాలన్న ఆయన నిరాడంబర సిద్ధాంతాన్ని ఆదర్శంగా తీసుకుని తమ ఆస్తులను ప్రకటించినట్లు ఈ ప్రపంచ కుబేరులందరూ పేర్కొన్నారు. లోకేష్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది కుబేరులు తమ ఆస్తులు ప్రకటించడానికి ముందుకొస్తున్నారు అంటూ న్యూస్ రీడర్ ముగించింది. అదంతా విన్న చంద్రబాబు మనసులో తండ్రిని మించిన తనయుడవని పించుకున్నావు, గ్రేట్ లోకేష్ అంటూ అభినందించాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులు తమ బాధ్యతలను జాగ్రత్తగా నిర్వహించండి. అనవసర సంఘర్షణలు వద్దు. విలువైన వస్తువులను సమకూర్చుకొంటారు. ఉద్యోగార్థులకు అవకాశాలు రావడం ప్రారంభమవుతుంది. కోర్టు వ్యవహారాలు అనుకూలం కాగలవు. ఆరోగ్యం జాగ్రత్త. వృత్తి పరమైన ఆటంకాలు తొలగడం వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగడం, ఆదాయం వృద్ధి బాగుండటం జరుగుతుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. క్రయవిక్రయాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాలు, బాకీల సమస్యలు కొంతవరకు పరిష్కారం కాగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది. ఉరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆదాయం ఆశించినంత ఉండదు. ఖర్చులు ఎక్కువుగా ఉంటాయి. చిన్న వ్యాపారులకు ఆశాజనకంగా ఉంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులు తమ పైఅధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. అనుకోని ప్రయాణాలుంటాయి. శరీరానికి గాయాలు తగలవచ్చును. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు. సంప్రదింపులు, అగ్రిమెంటు వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండండి. పెద్దమొత్తాలలో పెట్టుబడులు గాని, భాగస్వామ్య వ్యాపారాలు గాని చేయవద్దు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

నిర్మాణాలు, కార్మిక కాంట్రాక్టుదారులు వర్కలతో ఇబ్బందిపడతారు. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలు నెలకొంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. బంధువులతో, సోదరులతో సమస్యలు సర్దుబాటు చేసికొంటారు. ఆరోగ్యం బాగుంటుంది. వ్యాపారంలో ప్రోత్సాహకర పరిస్థితులుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యవసాయ, పారిశ్రామిక యజమానులకు పరిస్థితులు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగులకు పబ్లిక్‌తోను అధికారులతో సన్నిహితత్వం ఏర్పడుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు ప్రస్తుతం చేయవద్దు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. వస్తు, వాహన రిపేర్లుంటాయి. షేర్లు నిరుత్సాహం కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు మంజూరు కాగలవు. ఉద్యోగ బాధ్యతలను మంచి సామర్థ్యంతో నిర్వహిస్తారు. దూర ప్రయాణాలుంటాయి. శుభకార్యాల ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. రావలసిన బాకీలు కొంత లభించడం, మంచివార్తను వినడం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యముంటుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరంగా ఉంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 15.12.2017 నుండి
తేది. 21.12.2017 వరకు

ఈ వారం కర్కాటకంలో రాహువు, తులలో గురు కుజులు, వృశ్చికంలో రవి బుధ శుక్రులు, 16తేది ధనుస్సులో రవి, 20తేది ధనుస్సులో శుక్రుడు, ధనుస్సులో శని, మకరంలో కేతువు, తుల వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము

శుక్రమౌఢ్యమి జరుగుతున్నది. ఏ శుభకార్యము పనికిరాదు.
తేది 16 శనివారము ధనుర్మాసారంభము. పండగ నెల ప్రారంభం.

### మార్గశీర్ష మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | శుక్ర | త్రయోదశి | పూర్తిగ |
| తేది. 16 | శని | త్రయోదశి | ఉ॥ గం.7.13వ॥ |
| తేది. 17 | ఆది | చతుర్దశి | ఉ॥ గం.8.44వ॥ |
| తేది. 18 | సోమ | అమావాస్య | ఉ॥ గం.10.58వ॥ |

### పుష్య మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | మంగళ | పాడ్యమి | ప॥ గం. 1.04వ॥ |
| తేది. 20 | బుధ | విదియ | సా॥ గం.3.14వ॥ |
| తేది. 21 | గురు | తదియ | సా॥ గం.5.13వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

దూరప్రయాణాలు తప్పనిసరిగా ఉంటాయి. కొత్త వస్తువులు, విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. స్థిరాస్తుల లావాదేవీలందు అనుకూల పరిస్థితులుంటాయి. బంధుముఖ్యులు, ప్రముఖులను కలుసుకొంటారు. విద్యా వృద్ధి, ఆరోగ్యం బాగుంటుంది. పట్టుదలతో చేపట్టిన పనులను జరుపుతారు. అవసరాలకు రావలసిన డబ్బులందుతాయి. వ్యాపారాలలో రాబడి ఉంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ముఖ్యవిషయాలలో పెద్దల సలహాలను స్వీకరిస్తే మేలు జరుగుతుంది. రావలసిన బాకీలు పరిష్కారం కావడం, కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఉద్యోగార్థులకు ఆహ్వానాలు లభిస్తాయి. ఆర్థిక ప్రణాళికలు పథకాలతో వ్యాపార పరిశ్రమ రంగాలను వృద్ధి చేస్తారు. ఆదాయం పెరుగుతుంది. చేపట్టిన పనులు సానుకూలం కాగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

సభలు సమావేశాలలో పాల్గొంటారు. పెట్టుబడులకు మంచి అవకాశాలు లభిస్తాయి. షేర్ మార్కెట్ ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆరోగ్య ఆహార విషయాలలో జాగ్రత్త అవసరం. అనుకోని ఆదాయం కొంత లభిస్తుంది. కుటుంబ వ్యవహారాలలో అనుకూలత తక్కువుగా వుంటుంది. స్వయంగా వ్యవహారాలను చూచుకొనండి. ఆర్థికస్థితి బాగుండి ఆదాయం పెరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వస్తు వాహన రిపేర్లుండగలవు. షేర్లు నిరుత్సాహపరుస్తాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. అనుకున్న పనులు జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. ఉద్యోగులు తమ అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. కొత్త వస్తువులు సమకూర్చుకొంటారు. అనుకోని అదనపు ఖర్చులుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబసభ్యులతో అనుకూలత సరిగా ఉండదు. అనుకున్న పనులు కార్యక్రమాలు తొందర తొందరగా పూర్తి చేయగలరు. ఉద్యోగులకు పనిభారం, శ్రమ పెరుగుతుంది. అనవసర వ్యవహారాలలో తల దూర్చకండి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆర్థిక పరమైన ఇబ్బందులుంటాయి. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకోని ప్రయాణాలుంటాయి. సభలు సమావేశాలలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తారు. పనులు సక్రమంగా జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. ఆరోగ్యం బాగుంటుంది. స్థిరాస్తుల మీద కొంత ఆదాయం లభిస్తుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. వృత్తి వ్యవహారాలలో లాభసాటిగా ఉండి అభివృద్ధి బాగుంటుంది. నూతన పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారాలకు అవకాశాలుంటాయి.



# ఎవరిదీ పాపం... ఎవరికిది శాపం

గత కొద్ది రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తున్న సంఘటన హాస్యనటుడు విజయసాయి ఆత్మహత్య. గతంలో ఎంతో మంది సినీ ప్రముఖులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వారందరివి వివిధ కోణాలు, పలు కారణాలు. కానీ ఈ ఉదంతం మాత్రం వార్తల్లో నానుతూనే వుంది. ఇందుకు కారణం విజయ్ మరణానికి ముందు తీసుకున్న సెల్ఫీ వీడియో. బహుశా ఇలా సెల్ఫీలలో సైతం మరణవాంగ్మూలం ఇస్తారనే విషయం పోలీసుశాఖకు కూడా తొలిసారిగా అర్థమైనట్లుంది. మామూలుగా లేఖల రూపంలో దొరికే వాంగ్మూలాలని వాళ్ళు ఏమైనా చేసేయగలరు కానీ ఇలా సెల్ఫీవీడియోలను ఏమార్చడం ఎవరి తరమూ కాదు. ఈ సెల్ఫీని విజయ్‌సాయి ఎంతమందికి పంపించి వుంటాడో వారికి తెలియదు కాబట్టి ఈ విషయంలో వాళ్ళు గోల్‌మాల్ చేసే అవకాశమే లేదు.

ఇక సెల్ఫీ వీడియోతో పాటు దొరికిన సాక్ష్యాల ఆధారంగా (కార్లు, ఫోన్ సంభాషణలు) ఈ వ్యవహారంలో శ్రీనివాస్ అనే న్యాయవాది, శశిధర్ అనే పారిశ్రామికవేత్త, విజయసాయి భార్య ఏ1 ముద్దాయి వనితరెడ్డిలతో పాటు ఏ2, ఏ3 ముద్దాయిలుగా వుండడంతో ఇది పెద్ద చర్చనీయాంశంగా మారింది. పోలీసులకు దొరికిన రెండుకార్లలో ఒక దానిపైన అడ్వకేటు స్టిక్కర్ ఉండడం, మరో కారు శశిధర్‌కు చెందిన నవయుగ కంపెనీకి చెందడం.

నవయుగ కన్‌స్ట్రక్షన్స్, నవయుగ ఇన్‌ఫోటెక్‌తో పాటు కృష్ణపట్నం పోర్టు కంపెనీలు శశిధర్‌కి చెందినవి కావడంతో మీడియా హడావుడి కొంచెం ఎక్కువగానే కనిపిస్తోంది. ఇక సోషల్ మీడియాలో అయితే గంటకో కథ ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు చూపిస్తూ ఇది మా పరిశోధన అంటూ జబ్బలు కొట్టుకుంటున్నారు. పై విషయాలన్నీ మన కనవసరం. అసలు ఎక్కడో సినిమాల్లో చిన్నచిన్న వేషాలు వేసుకునే విజయ సాయి భార్యకీ ఈ శ్రీనివాస్, శశిధర్‌లకీ వున్న సంబంధ భావ్యాలు ఏమిటి...? బంధమా... బంధు త్వమా... లేక వేరే ఏదైనా అనుబంధమా...? ఈ ప్రశ్నలకు వాళ్ళు సమాధానాలు చెప్పాల్సివుంది.

నెల్లూరుజిల్లాకి సంబంధించినంత వరకు కృష్ణపట్నం పోర్టన్నా, ఆ కంపెనీ యాజమాన్య మన్నా ఓ ప్రతిష్టాత్మక సంస్థగా ప్రతిష్టాత్మక వ్యక్తులుగా అందరూ చూస్తారు. ఇక జిల్లా యంత్రాంగమైతే గల్లీ నుండి ఢిల్లీ వరకూ ప్రభుత్వ పెద్దలతో పోర్టు యాజమాన్యానికున్న పలుకుబడిని దృష్టిలో వుంచుకుని వాళ్ళ ఆజ్ఞలకు, ఆదేశాలకు, ఆలోచనలకు తోక వూపుతూ పని చేస్తారు. ప్రతిఫలంగా వాళ్ళ మర్యాదలనీ ఆస్వాదిస్తారు.

ఇలాంటి తరుణంలో పోర్టు యం.డి శశిధర్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమా? కాదా? అని రుజువు చేసుకోవలసిన బాధ్యత వారిపైనే వుంది. వారికి అపార పలుకుబడి వుండొచ్చు, వేలకోట్లు ఆస్తులుండొచ్చు... కానీ కాండక్ట్ & క్యారెక్టర్ చాలా ముఖ్యం. ఇప్పటికే వారి పోర్టులో భాగంగా సముద్ర మధ్యలో మయసభను తలపించే "దక్షిణ్"లో జరుగుతున్న 'దక్షిణ' వ్యవహారం కథలు కథలుగా బయటకు వినిపిస్తూనే వుంది. వాయు మార్గంలో వచ్చే విఐపిలకు జరిగే విందు వినోదాల ముచ్చట వాడవాడలా షికారు చేస్తూనే వుంది. పిల్లి కళ్ళు మూసుకుని పాలు త్రాగినట్లుగా ఈ "దక్షిణ్"లో వారు జరిపే కార్యకలాపాలు ఎవరికీ తెలియవని అనుకున్నా అది వారి భ్రమే.

నెల్లూరీయులకు పోర్ట్ అంటే ఓ ల్యాండ్‌మార్క్. నెల్లూరు అభివృద్ధికి దిక్సూచిగా కృష్ణపట్నం పోర్టును చూస్తారు. అలాంటి సంస్థ యాజమాన్యం ఇలాంటి 'గలీజు' వ్యవహారంలో అభాసుపాలైతే అది వారికే కాదు, వారిపై నమ్మకం పెట్టుకున్న జిల్లా వాసులకీ అవమానమే. నెల్లూరు పారిశ్రామికవేత్తలకు విశ్వవ్యాప్తంగా ఒక గుర్తింపు వుంది. మేధావులుగా పేరు ఉంది. చిల్లర చేష్టలకు దూరంగా వ్యాపారాన్ని భక్తితో చేస్తారన్న నమ్మకం ఉంది. ఒక జివికె, ఒక శీనయ్య, ఒక గునుపాటి ప్రసాద్‌రెడ్డి, ఒక దొడ్ల కుటుంబం, ఒక అల్లారెడ్డి కుటుంబం, ఒక సీబ్రోస్ కుటుంబం లాంటి ఎందరో తమ కండక్ట్‌ని ఉన్నతంగా ఉంచుకున్నవారే. శశిధర్ నెల్లూరు వాడు కాకపోయినా ఇప్పుడు నెల్లూరి వ్యాపారవేత్త కిందే లెక్క. ఇప్పుడు ఆయన శీలం ఏ3 నిందితునిగా పోలీస్ రికార్డ్సులో భద్రంగాఉంది. అదీ తన భార్య మీద అనుమానం వ్యక్తం చేస్తూ మరణించిన విజయ్ మాటల కారణంగా శశిధర్ పరువు బజారున పడింది. ఇప్పుడు తన శీలం ఉన్నతమైందని నిరూపించుకోవాల్సిన బాధ్యత శశిధర్‌పైనే ఉంది. విలువలతో కూడిన వ్యాపారం చేసే నెల్లూరియన్స్ పక్కన ధైర్యంగా నిలబడాలంటే కడిగిన ముత్యంలా బయటకు రావాల్సిన అగత్యం ఇప్పుడు శశిధర్‌పైనే ఉంది. వేచిచూద్దాం చట్టం ఎవరికి చుట్టమౌతుందో!

# పని మొదలుపెట్టాం!




నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) పని మొదలైందని, ఇళ్ళ నిర్మాణాలకు గాని, లేఅవుట్లకు గాని ఆన్‌లైన్ ద్వారా 'నుడా' అప్రూవల్స్ తీసుకోవచ్చని ఆ సంస్థ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చెప్పారు. 13వతేదీ నెల్లూరులోని 'నుడా' కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో 'నుడా'కు దరఖాస్తు చేసుకుని అప్రూవల్స్ పొందవచ్చన్నారు. నుడా ద్వారా మొదటి అప్రూవల్‌ను వెంకటేశ్వరపురంలో నిర్మిస్తున్న పేదల ఇళ్లకు ఇవ్వడం తన అదృష్టంగా ఆయన పేర్కొన్నారు. రెండో అప్రూవల్‌ను నెల్లూరులో కట్టనున్న షాదీమంజిల్‌కు ఇచ్చామన్నారు. నుడా పరిధిలో ఇక అక్రమ లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలు వుండవని చెప్పారు. నుడా పరిధిలో చేయాల్సిన మార్పులకోసం త్వరలోనే విశాఖపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను సందర్శించి అక్కడి పాలకులు, అధికారుల సలహాలు, సూచనలను స్వీకరిస్తామని చెప్పారు. 'నుడా' పరిధిలోని సమస్యలను పరిష్కరించే దిశగా త్వరలో ముఖ్యమంత్రిని కలుస్తామని చెప్పారు. మాస్టర్ ప్లాన్ ద్వారా నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తామని, నగరంలో త్వరలోనే ఒక ఫ్లైఓవర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ సమావేశంలో 'నుడా' డైరెక్టర్ ఖాజావలి, నుడా కార్యదర్శి పార్థసారధి పాల్గొన్నారు.

# సినిమా కాదు... సీరియల్!

(మొదటి పేజీ తరువాయి)

ఈ టీవీ, మా టీవీ, జెమిని టీవీలలో సీరియల్స్ వస్తుంటాయి. ఏళ్ల తరబడి సాగుతూనే వుంటాయి. అక్కడ సబ్జెక్ట్ ఏమీ ఉండదు. అంతా జీడిపాకంలాగా సాగతీయడమే! ఆ సీరియల్స్‌లో వుండే స్టోరీనే సినిమాగా మలిస్తే రెండు గంటలు... అది కూడా బోనస్‌గా అయిదారు పాటలు పెట్టుకోవచ్చు. అమరావతి రాజధానిని కూడా సినిమా లెవల్లో ఫినిష్ చేసి వుండొచ్చు. రాజధాని కట్టాలనుకుంటే అయిదారు వేల ఎకరాల భూమి సేకరించడం, రైతులకు దానికి తగ్గ పరిహారం చెల్లించడం, ప్రభుత్వ పరిపాలనకు అవసరమైన అసెంబ్లీ, సచివాలయం, మంత్రులు, ఎమ్మెల్యేల నివాసాలు, వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, ఉద్యోగుల కాలనీలు, వారికి అవసరమైన మౌలిక వసతులు... ఇంత వరకు తీసుకుని వుంటే ఇదివరకే రాజధాని రూపం ఓ కొలిక్కి వచ్చి ఉండేది. కాని, చంద్రబాబు అమరావతిని సినిమాగా క్లోజ్ చేయాలనుకోలేదు. 'మొగలిరేకులు' సీరియల్ లాగా సాగదీస్తున్నాడు. సీరియల్ మొదలుకావడమే అందరికీ తెలుసు. ఎప్పుడు ఎండ్ అవుతుందో ఎవరికీ తెలియదు. సింగపూర్ లాంటి రాజధానితో మొదలైంది అమరావతి సీరియల్. ఆ తర్వాత బీజింగ్ అని, కొలంబో అని, టోక్యో అని, మిలాన్, మాస్కో, వాషింగ్టన్, కౌలాలంపూర్... ఇలా అన్ని దేశాల ప్రధాన నగరాలను చుట్టేసింది. సింగపూర్, ఆస్ట్రేలియా, జపాన్ దేశస్థులు ఇచ్చిన రాజధాని డిజైన్‌లు అన్నీ మూలనపడ్డాయి. చివరకు లండన్‌కు చెందిన నార్మన్ పోస్టర్ చేతికి రాజధాని డిజైన్ వెళ్ళింది. మొదట్లో వాళ్ళు గీసిన డిజైన్‌లు కూడా చంద్రబాబుకు నచ్చలేదు. వాళ్ళకు సలహాలిచ్చేందుకు బాహుబలి సినిమా డైరెక్టర్ రాజమౌళిని తీసుకెళ్లాడు. ఎట్టకేలకు నార్మన్‌పోస్టర్ సంస్థ రెండు డిజైన్‌లకు తుది రూపకల్పన చేసి ఇచ్చింది. దర్శకుడు రాజమౌళి సూచనలు, సలహాలను పక్కనపెట్టి ఆ సంస్థ ఈ డిజైన్‌లను రూపొందించింది. డైమండ్ ఆకారంలో ఒకటి, టవర్ ఆకారంలో ఒకటి! టవర్ ఆకారం డిజైన్‌ను 70మీటర్ల ఎత్తుతో, 70 అంతస్థులతో రూపొందించారు. ఈ టవర్‌లో క్రింద అసెంబ్లీ వుంటుందట, టవర్ పైకి పర్యాటకులను పంపిస్తారట! ఇది అసెంబ్లీ భవనాన్ని కడుతున్నట్లు, రాజధాని నిర్మాణం చేస్తున్నట్లుగా లేదు, హాయ్‌లాండ్, వండర్‌వరల్డ్, కోరల్ ఐలాండ్ వంటి పర్యాటక వ్యాపార కేంద్రాలను పెడుతున్నట్లుగా వుంది. చంద్రబాబు విధానాలు పరిపాలన కంటే కూడా ప్రజలను ఆకర్షించేలా టూరిస్ట్ స్పాట్‌లను అభివృద్ధి చేయడానికే ప్రాధాన్యతనిస్తున్నట్లుగా వుంది. అమరావతికి ఇంతవరకు నాలుగుసార్లు శంకుస్థాపనలు చేశారు. వేలకోట్లు ఖర్చు పెట్టి తాత్కాలికంగా వర్షం వస్తే ఉరిసే భవనాలు కట్టారు. రాజధాని పేరుతో వేలకోట్లు తగలేస్తున్నారు. మళ్ళీ దీనిమీద రాజమౌళి చేత 'అమరావతి' సినిమా తీయిస్తారట. ఇది సినిమా కాదు... ఇప్పటివరకు 'అమరావతి రాజధాని' పేరుతో జరిగిన కథనంతా సీరియల్‌గా తీస్తే అయిదారేళ్లకు సరిపడా ఎపిసోడ్‌లను టీవీలలో వేసుకోవచ్చు. అమరావతి సినిమా కంటే సీరియల్ బెటర్... ఆలోచించండి.

# పవన్‌కు అంత సీనెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రజారాజ్యం పార్టీని పెట్టాక 2009 ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలలో అభ్యర్థులను పెట్టారు. 2014లో పవన్‌కళ్యాణ్ జనసేన పార్టీని పెట్టాడు. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో బీజేపీ, టీడీపీలతో పొత్తు పెట్టుకున్నాడు. జనసేన తరపున ఒక్క స్థానంలోనూ అభ్యర్థిని నిలబెట్టలేదు. ఈ మాత్రం దానికి పార్టీ పెట్టడమెందుకు? నేరుగా ఆ రెండు పార్టీలకు మద్దతు పలికుంటే పోయేది. పార్టీని ఆవిష్కరించాక కూడా ఎక్కడా పోటీ చేయని పార్టీగా జనసేన రాష్ట్ర రాజకీయ చరిత్ర రికార్డుల్లోకి ఎక్కింది.

సరే, ఆ ఎన్నికల్లో పోటీ అంటే చేయలేదు. కాని, ఆ తర్వాతన్నా ఒక సిద్ధాంతం మీద, ఒక ఆశయం మీద నిలబడ్డాడా అంటే అదీ లేదు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుంటే కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో టీడీపీని ప్రశ్నిస్తానని ఆరోజు ఘనంగా చెప్పాడు. ఆయన మద్దతు వల్లే రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగలిగింది.

అధికారంలోకి వచ్చాక బీజేపీ ప్రభుత్వం చేసిన మొట్టమొదటి పని ప్రత్యేకహోదాను తుంగలో తొక్కడం. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానిది కూడా తప్పుంది. ప్రత్యేకహోదా కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుబట్టలేదు. ప్రత్యేక ప్యాకేజీ ఇస్తే చాలని సరిపెట్టుకున్నాడు. ప్రత్యేకహోదా విషయంలో కేంద్రంపై విమర్శలు చేసిన పవన్‌కళ్యాణ్, అదే సమయంలో 'ఓటు-నోటు' కేసుకు భయపడి ప్రత్యేకహోదాపై రాజీపడ్డ చంద్రబాబు వైఖరిని మాత్రం ఆయన ఖండించలేకపోయాడు. ప్రధానంగా రాష్ట్ర రాజకీయాల్లో పవన్‌కళ్యాణ్ ప్రశ్నించాల్సింది, విమర్శించాల్సింది ప్రతిపక్షాన్ని కాదు. ప్రభుత్వంలో వున్న అధికారపక్షాన్ని. తెలుగుదేశం ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైంది. ఏ వర్గాల ప్రజలు సంతోషంగా లేరు. పవన్ ప్రశ్నించడానికి బొచ్చెబోలెడు అంశాలున్నాయి. మూడు పంటలు పండే భూములను లాక్కుని రాజధాని పేరుతో నాటకాలు, పుష్కరాల పేరుతో వేలకోట్ల నిధుల దుర్వినియోగం, పుష్కరఘాట్‌లలో తొక్కిసలాట, మహిళా అధికారి వనజాక్షిని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కొట్టడం, విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు, ఇసుక మాఫియా, పరిశ్రమల పేరుతో పచ్చటి పొలాల ఆక్రమణ, చివరకు పోలవరంపై చేతులెత్తేయడం... పవన్ తాను గెలిపించిన తెలుగుదేశం ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ఎన్నో అంశాలున్నాయి. కాని ఏ ఒక్కవాటి జోలికీ ఆయన పోడు.

కేవలం చంద్రబాబు రాజకీయ రక్షణ కోసమే ఆయన ప్రజలలోకి వస్తున్నాడు. చంద్రబాబు సమస్యల్లో పడ్డప్పుడు, చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డప్పుడు మాత్రమే పవన్‌కళ్యాణ్ తెరపైకి వస్తుంటాడు. రాష్ట్రంలో వైకాపా అధినేత జగన్ పాదయాత్ర ప్రభంజనం సృష్టిస్తున్న తరుణంలో మళ్ళీ ఒకసారి రాష్ట్ర రాజకీయ తెరపైకి వచ్చాడు. విశాఖ, రాజమండ్రి, ఒంగోలులలో సదస్సులు పెట్టాడు. చంద్రబాబును ఒక్క ప్రశ్న వేయలేదు. ఏ ఒక్క ప్రభుత్వ వైఫల్యాన్నీ వేలెత్తి చూపలేదు సరికదా, సీఎం కొడుకు సీఎం కావాలనుకోవడం తప్పు... జగన్ పై అవినీతి కేసులున్నందు వల్లే నేను మద్దతునివ్వలేదు... అంటూ మాట్లాడాడు. దీనిపై సోషల్ మీడియాలో అయితే పవన్‌ను దుమ్ము దులిపి వదిలారు. అన్న యాక్టర్ అయితే తమ్ముడు యాక్టర్ కావచ్చా? చిరంజీవి లేకుంటే మీరంతా ఎక్కడనుండి వచ్చేవాళ్ళు అంటూ కడిగి పెట్టారు. జగన్ అవినీతి పరుడని ఏ కోర్టు చెప్పింది... నిందితుడిని దోషిగా నిర్ధారించడానికి నువ్వెవరు? ఓటు-నోటు కేసులో పబ్లిక్‌గా దొరికిన చంద్రబాబు చంకనాకుతూ జగన్‌ను వేలెత్తి చూపే అర్హత నీకుందా? అంటూ ఎడాపెడా వాయించారు. దాదాపు 10రోజులు పాటు సోషల్ మీడియా వేదికగా వైసిపి - జనసేన అభిమానుల మధ్య పెద్ద యుద్ధమే నడిచింది.

రాష్ట్రంలో పవన్ కళ్యాణ్‌కు సినిమా పరంగా ఒక ఇమేజ్ వుంది. రాజకీయాల జోలికి రాకుంటే ఆ ఇమేజ్ అలాగే వుంటుంది. ఒకవేళ పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి రావాలనుకుంటే ముందు తనకు ఒక క్లారిటీ తెచ్చుకోవాలి. ప్రజల తరపున పోరాడేందుకు సిద్ధం కావాలి. అదేం లేకుండా చంద్రబాబు చొక్కాలో దాక్కుని ఇలా అప్పుడప్పుడూ రాళ్ళు విసురుతుంటే స్టార్ ఇమేజ్ వున్న పవన్‌కళ్యాణ్ అనే హీరో జీరోగా మారడానికి ఇంకెంతో కాలం పట్టదు. ఇక అసలు విషయానికొస్తే పవన్ విషయంలో వైసిపి శ్రేణులు ఇంతగా స్పందించాల్సిన అవసరం లేదు. పవన్ ఏంటన్నది ప్రజలకే కాదు, ఆయన అభిమానులకు కూడా అర్థమైపోయింది. ఆయన అభిమానులు కూడా సగం మంది రాజకీయంగా ఆయనతో విభేదిస్తున్నారు. ఆయన చంద్రబాబు తోకలా మారాడన్న విషయం లోకజ్ఞానం తెలిసిన అభిమానులకు అర్థమవుతుంది. కాబట్టి అభిమానులందరు కూడా కట్టగట్టుకుని ఆయన వెంట రాజకీయ ప్రయాణం చేసే అవకాశం లేదు. పవన్ అనే వ్యక్తి అప్పుడప్పుడూ వస్తుంటాడు... ఏదో ఒకటి మాట్లాడేసి పోతుంటాడు. ఆయన మాటలను వైసిపి శ్రేణులు సీరియస్‌గా తీసుకుంటే అది చంద్రబాబుకే లాభం. ఆయనకు కావాల్సింది కూడా వైసిపితో పవన్ అభిమానులు కలవకుండా చేయడమే! పవన్‌పైకి వైసిపి నేతలను రెచ్చగొట్టేలా చేసి ఆ పార్టీకి కాపులను దూరం చేయడమే!

పవన్‌ను చంద్రబాబు 'దూకుడు' సినిమాలో బ్రహ్మానందాన్ని మహేష్‌బాబు వాడుకున్నట్లుగా వాడుకుంటున్నాడు. ఈ విషయం పవన్‌కు అర్థం కావడం లేదు. అర్థమయ్యేసరికి పవర్‌స్టార్ పవర్‌లెస్ స్టార్‌గా మిగిలిపోతాడు.

## పేద గుండెల ధ్వని... 'జై ఆంధ్రా' ఉద్యమ సేనాని...

# మెట్టలో పుట్టిన మేటి నేత మాదాల జానకిరామ్



**ఉదయగిరి అంటే గుర్తొచ్చేది అలనాడు శ్రీకృష్ణ దేవరాయలు అయితే.. ఆధునిక రాజకీయ కాలంలో గుర్తొచ్చేది స్వర్గీయ బెజవాడ గోపాలరెడ్డి, ప్రస్తుత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడులు. వారి రాజకీయ ప్రస్తానం మొదలైంది ఇక్కడే! అలాగే వారితో పాటు గుర్తొచ్చే నాయకుడు మాజీ మంత్రి మాదాల జానకిరామ్. అయితే బెజవాడ గోపాలరెడ్డి, వెంకయ్యనాయుడులు డెల్టా ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ నిలబడ్డ నాయకులు. కాని, మాదాల జానకిరామ్ ఈ మెట్ట నేలపైనే పుట్టిన నాయకుడు. ఇక్కడి ప్రజల సమస్యలు తెలిసిన నాయకుడు. ఇక్కడి ప్రజల కోసం పోరాడిన నాయకుడు.**

నాయకుడంటే ప్రజల కోసం నిలవాలి, ప్రజల కోసం నడవాలి, ప్రజల కోసం గెలవాలి, ప్రజల మనస్సులు గెలవాలి. ఇలా నడిచి ఉదయగిరిలో వేలాదిమంది ప్రజల మనసులు గెలిచిన ప్రజా నాయకుడే మాదాల జానకిరామ్. 1970 దశకంలో నూనూగు మీసాల వయసులోనే ఆంధ్రసేనను స్థాపించి జైఆంధ్ర ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం పోరాటంలో ముందుండి నడిచాడు. లక్షల మంది ఉద్యమకారులను ముందుకు నడిపించాడు. జిల్లాలో సంచలనం రేపిన 'జైఆంధ్ర' ఉద్యమంలో ఆయనది అనిర్వచనీయమైన పాత్ర.

ఉద్యమనేతగా, రాజకీయ నేతగా, పారిశ్రామికవేత్తగా, రైతు బిడ్డగా, ఆధ్యాత్మిక చింతనాపరుడిగా, ఎక్కడ వున్నా ఆయనది విలక్షణ వ్యక్తిత్వం. రాజకీయాలలో ఆయన ప్రయాణం కొన్నేళ్లే! 1978 ఎన్నికల్లో ఓడిపోయాడు. 1989 వరకు రాజకీయాలకు దూరమయ్యాడు. 1989లో ఉదయగిరి ఎమ్మెల్యేగా గెలిచాడు. 1991–93ల మధ్య నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మంత్రివర్గంలో భూగర్భ గనుల శాఖ మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత 1994, 2004 ఎన్నికల్లో పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. కాని ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసింది ఐదేళ్ళ కాలమే అయినా అయిదు తరాలవాళ్ళు మరచిపోనంతగా ఉదయగిరి ప్రజలపై తనదైన ముద్ర వేసుకున్నారు. రాజకీయాలలో శత్రువు చేత కూడా శెభాష్ అనిపించుకునే వ్యక్తిత్వం ఆయనది. తప్పు చేసింది తనవాడైనా ముఖాన్నే నిలదీసే గుణం ఆయనది. మంత్రిగా వుండగా ఉదయగిరి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. విద్యాభివృద్ధికి కృషి చేసారు. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి అంకురార్పణ చేసింది ఆయనే! ఉదయగిరిలో ఆర్టీసీ డిపో రావడంలో ఆయన కృషి వుంది. అన్నింటిని మించి మెట్టప్రాంతమైన ఉదయగిరిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు వెలుగొండ ప్రాజెక్ట్, సీతారాంసాగర్ ప్రాజెక్ట్, సాగర్ ఎడమ కాలువ పొడిగింపు కోసం ఆయన చేసిన పోరాటాన్ని ఈ ప్రాంత ప్రజలెవ్వరూ విస్మరించరు. ఇలా ఉదయగిరి రాజకీయ చరిత్రలో మాదాల జానకిరామ్ మరపురాని వ్యక్తిగా నిలిచిపోయారు. ప్రజలతో ఇంతగా మమేకమైన ఆ ప్రజానాయకుడి ఆకస్మిక మరణాన్ని ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నెల 20వ తేదీన స్వగ్రామం నర్రవాడలో జరిగే ఉత్తరక్రియలకు పెద్దఎత్తునే ప్రజలు తరలిరానున్నారు.

### మంత్రి కార్యాలయం వద్ద
### దోమల మందు చల్లి...
# బీజేవైఎం వినూత్న నిరసన



నెల్లూరు, గోమతినగర్‌లో మున్సిపల్ మంత్రి పి.నారాయణ క్యాంప్ కార్యాలయం వుంది. ఈ పరిసరాలలో రోడ్లు అధ్వాన్నంగా వున్నాయి. అన్నీ ఖాళీస్థలాలు. వాటిలో మురికి నీళ్ళు. దీంతో దోమల మోత. దీనిని సరిగ్గా క్యాచ్ చేసారు బీజేవైఎం జిల్లా నాయకులు. బీజేవైఎం నగర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో 13వ తేదీ ఈ పరిసరాలలో దోమల మందు స్ప్రే చేసి తమ నిరసన తెలిపారు. మున్సిపల్ మంత్రి సొంత ఊర్లో, ఆయన కార్యాలయం వుండే ప్రాంతంలో దోమల బెడద అధికంగా వుందని, మంత్రి కార్యాలయానికి వచ్చే వాళ్ళు ఈ దోమల బారిన పడుతున్నారని, వారు పడుతున్న ఇబ్బందులను మంత్రికి తెలియజేసేందుకే ఆయన కార్యాలయం చుట్టూ దోమల మందు చల్లుతున్నామని బీజేవైఎం నాయకులు పేర్కొన్నారు.

# 24న కవితలు, వ్యాసరచన పోటీలు

ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్, ఆర్‌టిఐ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ ఫరమ్, నెల్లూరుజిల్లా రచయితల సంఘం, ఉగ్రనేత్రం వారపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 24వ తేదీ ఆదివారం సాయంత్రం 5గంటలకు నెల్లూరు టౌన్‌హాలు రీడింగ్ రూమ్‌లో విద్యార్థిని, విద్యార్థులకు కవితలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎ.జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా ఈ మెయిల్ అడ్రసుకు పంపాలన్నారు. ఇతర వివరాలకు 94402 75013, 94902 30939 సెల్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

### కొత్త సంవత్సర కానుక...
# విపిఆర్ వేదికపై వినోదాల వేడుక

ఆటల సవ్వడి, పాటల సందడి, సరదాల అలజడితో 2017కి వీడ్కోలు పలికి 2018కి స్వాగతం పలకడానికి విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. 'విపిఆర్ వేదికపై వినోదాల వేడుక' పేరుతో జరిగే ఈ సంబరంలో ప్రముఖ గాయణీమణి శ్రావణిభార్గవితో పాటు సాకేత్, సాహితి, ప్రవస్థి, పరమేశ్వర్‌లు తమ గాన మాధుర్యంతో అలరించనుంటే, 'చిన్ను'గా ప్రసిద్ధి గాంచిన బేబి శృతి తన నృత్యంతో ఆకట్టుకోబోతోంది. డిసెంబర్31, ఆదివారం సాయంత్రం 7గంటల నుండి రాత్రి 12 గంటల వరకూ జరిగే ఈ హంగామాలో పలు రకాల వంటకాలతో, ఆకట్టుకునే సర్‌ప్రైజ్‌లతో 5గంటల పాటు నిర్విరామంగా నిరంతరాయంగా ఈ వేడుక జరిగేలా నిర్వాహకులు రూపకల్పన చేశారు. నెల్లూరీయులకు నూతన సంవత్సర కానుకగా మంచి కార్యక్రమాన్ని అందించాలనే సంకల్పంతో అతితక్కువ ధర టిక్కెట్‌తో పరిమిత సంఖ్య ప్రేక్షకులతో సంరంభాన్ని జరుపుకోనున్నారు. టిక్కెట్లు కావలసినవారు 9985822049 నెంబరును సంప్రదించవచ్చును. మగవారికి నల్లచొక్కా, మహిళామణులకు ఎరుపు, నలుపు వస్త్రధారణ తప్పనిసరిగా వుండాలనే నిబంధన కూడా వర్తిస్తుంది.




# కార్పొరేషన్‌లో అవినీతి కంపు

### - రూప్‌కుమార్ విమర్శ



నెల్లూరు కార్పొరేషన్‌లో పాలన పూర్తిగా భ్రష్టుపట్టి పోయిందని, ఏ విభాగం చూసిన అవినీతి కంపు కొడుతోందని, అసలు పాలన అనేది జరుగుతుందో లేదో కూడా తెలియడం లేదని, అంతా అస్తవ్యస్తమై పోయిందంటూ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ రూప్ కుమార్‌యాదవ్ తీవ్రంగా విమర్శించారు. ఈ నెల 13న ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ, కార్పొరేషన్ తీరుపై మండిపడ్డారు. కార్పొరేషన్‌లోని కొన్ని విభాగాల్లో అనేక కుంభకోణాలు, గోల్మాల్‌లు జరుగుతున్నాయంటూ పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, అయినా ఎవరూ స్పందించడం లేదన్నారు. కార్పొరేషన్‌లో పాలన జరుగుతోందా?..అనే అనుమానం తమకు కూడా కలుగుతోందన్నారు. ఏ పని కావాలన్నా కార్పొరేటర్‌లు కార్పొరేషన్ కార్యాలయానికి రోజుల తరబడి తిరగాల్సివస్తోందన్నారు. ఏ అధికారి ఎప్పుడు వస్తారో తెలియదని, అధికారుల సమాధానం మరీ నిర్లక్ష్యంగా ఉంటోందని, ఇంత దుస్థితి ఏ కార్పొరేషన్‌లోనూ ఉండదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలపై పోరాటం చేసిన నాయకులపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టడం మంచిపద్ధతి కాదన్నారు. గతంలో అనేక సందర్భాల్లో ఇలా జరిగినప్పుడు ఇలాంటి కేసులు పెట్టిన దాఖలాలు లేవన్నారు. అసలు కార్మికులను అడ్డుకోనప్పుడు దొంగకేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మీసునంద, ఊటుకూరు మాధవయ్య, ఎం.డి ఖలీల్ అహ్మద్, ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు, వైసిపి నాయకులు వేలూరు మహేశ్, వందవాశి రంగ, కుంచాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# రికార్డు సృష్టిస్తోన్న శ్రీధర్‌రెడ్డి 'ప్రజాబాట'

- లక్షా 10వేల మంది ప్రజలతో ముఖాముఖీ
- 31,012 మంది ఇళ్ళకు వెళ్ళిన ఎమ్మెల్యే
- 75 రోజుల్లోనే అనితరసాధ్యమైన పర్యటనలు
- ఎన్నో ప్రజాసమస్యలకు పరిష్కారాలు




నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన పర్యటనలో రికార్డులు సృష్టిస్తున్నారు. ఒక ఎమ్మెల్యేగా తనను గెలిపించినందుకు ఆ ప్రజలకు సేవ చేయడమే పరమావధిగా భావించిన శ్రీధర్‌రెడ్డి, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వారి సమస్యలు పరిష్కరించేందుకు సమాయత్తమయ్యారు. 105 రోజుల పాటు ప్రజాబాట కార్యక్రమానికి స్వయంగా ప్రణాళిక రూపొందించుకుని ఇంటింటికీ వెళ్ళి ప్రజలను నేరుగా కలుసుకుని వారితో మాట్లాడి, వారి అవసరాలేమిటో తెలుసుకుని ఆ మేరకు ప్రజల సమస్యలను తీర్చేందుకు సంకల్పించారు. ఈ నెల 13వ తేదితో ఈ మహత్తరమైన ప్రజాబాట కార్యక్రమం 75 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి 23వ డివిజన్‌లోని జనశక్తి నగర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తాను ఇన్నిరోజులు ఏఏ కార్యక్రమాలను నిర్వర్తించారో తెలియజేశారు. ఈ 75 రోజుల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 38 గ్రామాల్లో ప్రజాబాట పూర్తయిందన్నారు. అదేవిధంగా నగరంలోని 21 కాలనీల్లో ప్రజాబాట ద్వారా ప్రజలను కలుసుకున్నామన్నారు. మొత్తంగా 31,012 ఇళ్ళకు వెళ్ళి, నేరుగా ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నామని, ఇప్పటిదాకా సుమారు లక్షా 10వేల మంది ప్రజలను కలుసుకున్నామని ఆయన వివరించారు. 73 చోట్ల విద్యార్థులతోను, రైతులతోను, పొదుపు మహిళలు, సీనియర్ సిటిజన్స్, చేనేతకారులు, గిరిజనులు, బిసిలు, దళితులు, మైనార్టీలు..ఇలా అన్నివర్గాల ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నానన్నారు. తాను ప్రజలను కలుసుకున్నప్పుడు అనేకమంది తమకు ఇళ్ళస్థలాలు ఇప్పించి ఆదుకోవాలని, పింఛన్లు ఇప్పించాలని కోరారని, అనేకమందికి ఇంకా రేషన్‌కార్డులు కూడా లేవని, కాలనీల్లో కనీస వసతులు లేవని, పక్కా రోడ్లు కానీ, డ్రైనేజీ సౌకర్యాలు కానీ లేవని తెలిపారన్నారు. మంచి నీటి వసతులు కూడా సరిగా లేవని, అదేవిధంగా నిరుద్యోగ సమస్యతో యువత ఎన్నో బాధలు పడుతున్నారన్నారు. ఈ సమస్యలన్నిటినీ ఏరోజుకారోజు ఎస్ఎంఎస్, వాట్సాఫ్‌ల ద్వారా, తన కార్యాలయ సిబ్బంది ద్వారా సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నానన్నారు. ఈ సమస్యలు విన్నవించాక కొంతమంది అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తున్నారని, మరికొందరు ఇంకా నిర్లక్ష్యంగానే ఉంటున్నారని ఆయన ఆవేదనగా అన్నారు. న్యాయమైన ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు స్పందిస్తే, ప్రజాబాట పూర్తయిన తరువాత వారిని పూలమాలలతో సత్కరిస్తామన్నారు. ప్రజాసమస్యలపై స్పందించకుంటే ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజాబాట మధ్యలోనే మెరుపు ధర్నాలు, నిరసన దీక్షలకు దిగుతున్నానన్నారు. ప్రజాబాటలో గుర్తించిన ప్రతి సమస్య పరిష్కారానికి అలుపెరుగని పోరాటం సాగిస్తానని కోటంరెడ్డి స్పష్టం చేశారు. ప్రజాసమస్యల సాధన కోసం జాతిపిత గాంధీజీ చేసిన ప్రజాఉద్యమం లాంటిదే మన ఎమ్మెల్యే-మన ఇంటికి కార్యక్రమమని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఏదేమైనా, ఒక ఎమ్మెల్యే ఇలా ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడమన్నది ఎంతో అరుదైన విషయమని ప్రజలు ఆయనను అభినందిస్తున్నారు.

## వేగం పుంజుకున్న రహదారి పనులు

- ఈ రోడ్డు విస్తరణ పూర్తయితే ప్రయాణీకులకు పండుగే

భారతదేశ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కేంద్రమంత్రిగా ఉన్న రోజుల్లో ప్రత్యేక చొరవ తీసుకుని రెండులైన్‌లుగా వున్న పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిని ఆరులైన్లుగా మార్చడానికి ఆమోదముద్ర వేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభ్యర్ధన మేరకు వెంకయ్యనాయుడు కేంద్రప్రభుత్వం ఆమోదంతో ఆరులైన్లుగా మార్చాలనుకోవడం వెంటనే సర్వే పనులు జరిగిపోవడం విశేషం. రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నా ఇంతకాలం అభివృద్ధికి దూరంగా ప్రమాదాలకు నిలయంగా ఉంది. ఈ దారి చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారి నుంచి నాయుడుపేట వద్ద పడమర మార్గానికి చీలి కర్ణాటక, కేరళ రాష్ట్రాలను ఆంధ్రప్రదేశ్‌తో కలుపుతూ పోతుంది. ప్రపంచ ప్రఖ్యాత గాంచిన తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రాలకు ఇది ప్రధాన రహదారిగా నిలుస్తుంది. శ్రీకాళహస్తి, కాణిపాకం, కాంచీపురం, తిరుత్తణి, తిరువళ్ళూరు, శ్రీపురం లాంటి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలకు కూడా ఇది దారి కావడం విశేషం. హైదరాబాదు, అమరావతి పట్టణాల నుంచి బెంగుళూరు, చెన్నై లాంటి పట్టణాలకు రోడ్డు రవాణాకు ఇది ప్రధానమార్గంగా నిలుస్తుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ రహదారి ఇంతకాలం రెండు లైన్‌లుగా ఉండడం, వాహనాల రద్దీ పెరగడంతో అడుగడుగునా ప్రమాదాలు చోటు చేసుకునేవి. ఇవన్నీ గుర్తించిన వెంకయ్యనాయుడు 24అడుగులు వెడల్పు కలిగిన ఈ రహదారిని 96 అడుగులకు విస్తరింపజేయడానికి కేంద్రం నుంచి అనుమతులు మంజూరు చేయించడంలో కీలకపాత్ర పోషించారు. ఈ విస్తరణలో భాగంగా ప్రధాన కూడళ్ళలో వంతెనలు నిర్మించనుండడంతో ప్రమాదాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ రహదారికి శాటిలైట్ సర్వే పూర్తికాగా ప్రస్తుతం రెవెన్యూ సర్వేలు జరుగుతున్నాయి. ఈ సర్వేలు అన్ని పూర్తయిన తర్వాత భూసేకరణ చేసి పనులు ప్రారంభించనున్నారు.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com